
ములకలచెరువులో పెన్షన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి, తదితరులు


మదనపల్లె మండలం సీటీఎంలో పెన్షన్ల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఆర్డీవో హరిప్రసాద్


ఓబులవారిపల్లెలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్


చిన్నమండెంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న మంత్రి మండిపల్లి సతీమణి హరిత


రాజంపేటలోని ఊటుకూరులో పెన్షన్‌లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం

పండగే.. పండగ..

● పెన్షనర్ల ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందం ● పొద్దుపొడవక ముందే మొదలు ● పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కూటమి నేతలు
● జిల్లాలో 94.63 శాతం పంపిణీ ● చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఎటుచూసినా పండుగ వాతావరణం కనిపించింది. ఊరూ..వాడా.. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పండుగ జరిగింది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పడి కనీసం నెల కూడా కాకముందే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇచ్చిన రూ.3 వేలకు మరో వెయ్యి పెంచి పంపిణీ చేశారు. ఈ మొత్తానికి ఏప్రిల్ నుంచి వేయి రూపాయల లెక్కన మూడు వేలు కలిపి.. ఒకసారిగా రూ.7 వేలు లబ్ధిదారులకు అందించారు. పొద్దుపొడవక ముందే.. సచివాలయ సిబ్బంది చేతుల మీదుగా పెన్షన్ల పంపిణీ మొదలైంది. ఈ పంపిణీ కార్యక్రమంలో పలుచోట్ల టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు, క్రియాశీల కార్యకర్తలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్ల పంపిణీ జరిగేలా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లను పెంచిన చంద్రబాబు తమ ఇంటికి పెద్దబిడ్డ అని.. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఇతరులు కొనియాడారు. చంద్రబాబు రుణం తీర్చుకోలేమని పేర్కొంటున్నారు. పలుచోట్ల చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జిల్లాలో 2,23,436 మందికి పెన్షన్లు ఇవ్వాల్సి ఉండగా.. మొదటి రోజు 2,11,442 మందికి పెన్షన్లను అందజేశారు. సర్వర్ సమస్యతో కొన్నిచోట్ల పెన్షన్ పంపిణీ ఆలస్యంగా జరిగింది. అయితే జిల్లాలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ లక్కిరెడ్డిపల్లె మండలంలో పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు.

రాయచోటి నియోజకవర్గంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత చిన్నమండెం మండలంలో పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. నియోజకవర్గమంతా.. టీడీపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు. పీలేరులో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, ఆర్డీవో హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలతో కలసి పెన్షన్లు పంపిణీ చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు. రాజంపేటలో టీడీపీ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. రైల్వేకోడూరులో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పీలేరులో పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి


ఒంటిమిట్టలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రూ.7 వేలు ఇవ్వడం సంతోషంగా ఉంది..



ఎన్నికలప్పుడు పాత పెన్షన్ రూ.3 వేలకు ఇంకో వేయి రూపాయలు పెంచడమే కాకుండా.. ఇంకో మూడు వేలు ఇస్తానన్న మాట ప్రకారం.. చంద్రబాబునాయుడు ఈరోజు రూ.7 వేలు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఇకపై ప్రతి నెలా గతం కంటే.. అదనంగా వచ్చే వేయి రూపాయలతో ప్రతి ఇంట్లోనూ అదనపు సంతోషం వెల్లివిరుస్తుంది.

- జయమ్మ, ఎన్టీఆర్ నగర్, పీలేరు


మాలాంటి ముసలోళ్లకు ఆసరా..



మూడు నెలలకు రూ.3 వేలు, ఇక నుంచి ప్రతి నెలా వేయి రూపాయలు పెంచడం మాలాంటి ముసలోళ్లకు ఇంకొంచెం ఆసరాగా ఉంటుంది. వృద్ధాప్యంలో మందుల ఖర్చులకు ఇతర వాటికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. మమ్మల్ని చంద్రబాబు బిడ్డలాగా ఆదుకున్నాడు.

- శారదమ్మ, పాతబస్టాండు, పీలేరు

వృద్ధాప్యంలో ఎంతో ఆసరా..



చంద్రబాబునాయుడు ఎన్నికలప్పుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. గత ప్రభుత్వం మాదిరి కాకుండా ఇచ్చిన మాట ప్రకారం మొదటి నెలలోనే పెన్షన్ పెంచి ఇచ్చారు. మూడు నెలల బకాయితో కలిపి రూ.7 వేలు ఇచ్చారు. పెరిగిన పెన్షన్‌తో వృద్ధాప్యంలో ఎంతో ఆసరా లభించింది. ఆయన రుణం జీవితంలో మరువలేం.

- చింతకుంట్ల క్రిష్ణమూర్తి, త్యాగరాజు కాలనీ, ములకలచెరువు

చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు..



ఎన్నికల సమయంలో పెన్షన్ పెంచి లబ్ధిదారులకు అండగా ఉంటానని, ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాట నిలబెట్టుకున్నాడు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నెల కూడా గడవకముందే..పెన్షన్లను పెంచడం చరిత్రాత్మక నిర్ణయం. చంద్రబాబుకు రుణపడి ఉంటాము.

- రెడ్డెయ్య

చంద్రబాబుకు రుణపడి ఉంటాం..



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం..ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందించడం సంతోషంగా ఉంది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ప్రతి ఒక్కరూ..ఆయనకు రుణపడి ఉండాలి. ఒకటో తేదీ పెన్షన్ల పంపిణీ ఒక పండుగలా జరిగింది.

- నారాయణ, శెట్టిపల్లె, సంబేపల్లె

పేదవారి సంక్షేమానికే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు : కలెక్టర్

లక్కిరెడ్డిపల్లె, జూలై 1: పేదవారి సంక్షేమం సామాజిక భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తోందని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. సోమవారం లక్కిరెడ్డిపల్లె మండలంలోని అనంతపురం గ్రామం ఈడిగపల్లెలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొంతమంది లబ్ధిదారుల ఇళ్లకు కలెక్టర్ స్వయంగా వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లు అందచేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పెన్షన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంతమందికి పెన్షన్లు పంపిణీ చేసింది రసీదులు తప్పక ఉండాలని తెలిపారు. లబ్ధిదారులకు వేలిముద్రలు పడకపోయినా, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని కలెక్టర్ విలేకరులకు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు కూడా అధికారులు వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారని తెలిపారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమం చాలావరకు విజయవంతమైందని, అరకొరగా నిలిచిపోయిన వారికి మంగళవారం కూడా పెన్షన్ అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మదన్ మోహన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం ఈడిగపల్లెలో పెన్షన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

పెన్షన్ల పంపిణీలో చేతివాటం

● రూ.200 కోత ● వలంటీర్‌తో కలిసి పంపిణీ చేసిన సచివాలయ సిబ్బంది

పుల్లంపేట, జూలై 1: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పెన్షన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది రూ.200 తాము తీసుకుని మిగిలిన మొత్తాన్ని పెన్షనర్లకు అందచేశారు. మండలంలోని టి.కమ్మపల్లె పంచాయతీ కృష్ణంపల్లెలో సచివాలయ సిబ్బంది వలంటీర్‌తో కలిసి పెన్షన్‌లు పంపిణీ చేసి చేతివాటం ప్రదర్శించారు. ఈ గ్రామంలో సుమారు 40కి పైగా వివిధ రకాల పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్ ఫణిక్రిష్ణ, డిజిటల్ అసిస్టెంట్ మహేశ్‌లు గతంలో పనిచేసిన వలంటీర్ సురేష్‌ను వెంటబెట్టుకుని పెన్షన్ పంపిణీ చేశారు. తనకు జగన్ ప్రభుత్వం జీతాలు సక్రమంగా ఇవ్వలేదని ఒక్కో పెన్షన్ లబ్ధిదారుడి నుంచి 200 రూపాయల చొప్పున వసూలు చేశారు. ఈ విషయాన్ని కూటమి నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి రామసుబ్బయ్య పెన్షన్‌దారులకు 200 రూపాయలను మధ్యాహ్నం తిరిగి ఇచ్చేశారు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని, చెబితే పెన్షన్ ఆగిపోతుందని భయపెట్టినట్లు తెలిసింది. గతంలో కూడా సచివాలయ సిబ్బంది వివిధ ప్రభుత్వ పథకాల్లో అనర్హులకు చోటు కల్పించి సగం సగం వాటాలు పంచుకున్నట్లు ఉన్నతాధికారులకు గ్రామస్థులు పక్కా ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా డైరెక్టుగా సచివాలయ సిబ్బంది ఫోన్‌పే ద్వారా డబ్బులు కూడా తీసుకున్నట్లు గ్రామస్థులు ఆధారాలతో బయటపెట్టారు. ఉన్నతాధికారులు విచారించినా స్థానిక వైసీపీ నాయకుల పలుకుబడితో అప్పట్లో బయటపడ్డారు. అయినా వారిలో మార్పు రాలేదు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది చేతివాటం ప్రదర్శించడంపై కూటమి నాయకులు భగ్గుమంటున్నారు.

పెన్షన్ పంపిణీలో చేతివాటం ప్రదర్శించడంపై ఎంపీడీవో నరసింహమూర్తిని వివరణ కోరగా బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చంద్రబాబు దేవుడిలా ఆదుకున్నాడు..



నాకు కిడ్నీలు చెడిపోయాయి. మా పిన్నమ్మ నారాయణమ్మ కిడ్నీ దానం చేసి పునర్జన్మ ఇచ్చింది. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కిడ్నీలు మార్పిడి చేయించుకున్న వారికి పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచి ఇవ్వడం ఆనందంగా ఉంది. ఇంతకుముందు.. రూ.5 వేలు మాత్రమే వచ్చేది. ప్రతి నెలా మరో ఐదు వేలు అదనంగా వేసుకుని..మాత్రలు తెచ్చుకునే వాడిని.. ఇప్పుడు చంద్రబాబు పెంచిన పెన్షన్ రూ.10 వేలతో నెలకు సరిపడా మందులన్నీ..ఒకేసారి కొనగలుగుతా..

- బాలగంగాధర్, వాల్మీకిపురం

వామ్మో.. బొప్పాయి లారీలా..?

● అధిక లోడుతో విద్యుత్ ప్రమాదాలు ● చనిపోతున్న కార్మికులు ● డబ్బులు ముట్టజెప్పి చేతులు దులుపుకుంటున్న బొప్పాయి వ్యాపారులు

రైల్వేకోడూరు, జూలై 1: పొట్టకూటి కోసం కూలి పనులకు వెళ్లిన వారు విద్యుత్ ప్రమాదాలతో విగత జీవులుగా మారుతున్నారు. బొప్పాయి కాయలు కోసేందుకు కూలీలుగా వెళ్లిన వారు ఆ లారీలకు జరిగే విద్యుత్ ప్రమాదాలతో ఏటా బొప్పాయి కార్మికులు చనిపోతున్నారు. కూలీ పనులకు రావాలంటేనే కార్మికులు భయాందోళన చెందుతున్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఇంతో అంతో డబ్బులు ఇచ్చి వ్యాపారులు చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. లారీ కెపాసిటీకి మించి కాయలను లోడింగ్ చేయించడంతోనే లారీలకు విద్యుత్ తీగలు తగులుకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదంతా అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికే ఈ ఏడాది ఇద్దరు కార్మికులు విద్యుత్ ప్రమాదాలు జరిగి చనిపోయారు. గుత్తి, గుంతకల్, తాడిపత్రి, కర్నూలు, ఆళ్లగడ్డ, నంద్యాల, పత్తికొండ తదితర ప్రాంతాల నుంచి వలస వచ్చి బొప్పాయి కార్మికులుగా పనిచేస్తున్నారు. సుమారు 2 వేల మందికి పైగా బొప్పాయి కూలీలు రైల్వేకోడూరు, పెనగలూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాలకు చెందిన బొప్పాయి తోటల్లోకి వెళ్లి కాయల కోత నుంచి ప్యాకింగ్, లోడింగ్ తదితర పనులు చేస్తుంటారు. చిట్వేలి రోడ్డుకు కార్మికులు ప్రతిరోజూ ఉదయాన్నే చేరుకుంటారు. అక్కడకు లారీలు వస్తాయి. ఏయే మండలాల్లో, ఏయే ఏయే రైతు తోటల్లో కాయలు కోయాలి అనేది ఉదయాన్నే తెలిసిపోతుంది. లోడింగ్ అవసరమయ్యే గడ్డి, పేపర్లు తదితరాలను తీసుకుని లారీల్లో కార్మికులను తీసుకుని తోటల దగ్గర దింపుతారు. కాయల కోతలు జరుగుతుండగానే లారీలకు లోడింగ్ చేస్తారు. 5 టన్నుల కాయలను వేయాల్సి ఉండగా 8 టన్నులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి గ్రామంలోను విద్యుత్ తీగలు ఉంటాయి. తీగలు ఉన్న ప్రాంతంలో లోడింగ్ చూసుకోకుండా వ్యాపారులు చెప్పినట్లుగా కార్మికులు అధిక లోడు వేసి లారీలపైన కూర్చుని వస్తుండటతో విద్యుత్ తీగలు తగులుకుని కార్మికులు మృత్యువాత పడుతున్నారు. ఐదేళ్ల కిందట చిట్వేలి రోడ్డు వద్ద విద్యుత్ తీగలు తగులుకుని బొప్పాయి కార్మికుడు మృతి చెందాడు. జూన్ 5వ తేదీ మండలంలోని రాఘవరాజపురం సమీపంలో దోసకాయల లోడు వేస్తుండగా కార్మికుడు మోపూరి శ్రీను (25) విద్యుత్ తీగలు తగులుకుని చనిపోయాడు. ఇతను గిరిజన కుటుంబానికి చెందిన వాడు. కొందరు శవ రాజకీయాలు చేసి కొంత డబ్బులను ఇప్పించి చేతులు దులుపుకున్నారు. అలాగే జూన్ 17వ తేదీ మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని వడ్డిపల్లె వద్ద బొప్పాయి లారీ ముందు భాగంలో కాయలను ఎత్తుగా లోడింగ్ చేసి మరో తోట వద్దకు వెళుతుండగా విద్యుత్ తీగలు తగులుకుని లారీ మొత్తం కాలిపోయింది. ఈ ప్రమాదంలో కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం సూర్యతాండకు చెందిన మహిళా కూలీ మంజుల మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మంజులకు నలుగురు పిల్లలు ఉన్నారు. భర్త శంకర్‌నాయక్ కూడా కూలీ పనులకు వెళ్లి జీవనోపాధి పొందుతున్నాడు. ఊరు కాని ఊరికి వచ్చి కూలీ, నాలీ చేసుకుని జీవించే కార్మికులు విద్యుత్ తీగలు తగులుకుని మృత్యువాత పడుతున్నారు. 10 సంవత్సరాల కిందట మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీలో బొప్పాయి లారీకి విద్యుత్ తీగలు తగులుకుని ఒకరు మృతి చెందారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా ఏ అధికారి పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. పోలీసులు కూడా కేసులు నమోదు చేసి అనంతరం వాటి గురించి పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నిబంధనలను పక్కన పెట్టి బొప్పాయి వ్యాపారులు లారీలకు అధిక లోడ్లు వేసి పంపడం రైల్వేకోడూరులో పరిపాటిగా మారింది. రోజుకు 100 లోడ్లు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నాయి. నూతన ప్రభుత్వమైనా దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


విద్యుత్ ప్రమాదంలో కాలిపోతున్న లారీ (ఫైల్)


అధిక సంఖ్యలో కార్మికులు లారీపై వస్తున్న దృశ్యం (ఫైల్)


లారీ కాలిపోయిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికురాలు మంజుల, మోపూరి శ్రీను (ఫైల్‌ఫొటోలు)

కష్టమైనా మిగిలేనా..?

● పడిపోతున్న టమోటా ధరలు ● మదనపల్లె మార్కెట్‌లో కిలో రూ.30

మదనపల్లె టౌన్, జూలై 1: రైతులను కవ్వించేది..నవ్వించేంది..ఏడిపించేది ఏదంటే టమోటా పంట అని చెప్పవచ్చు. టమోటా ధరల దోబూచులాటలో రైతులు బలి అయిపోతున్నారు. మదనపల్లె టమోటా మార్కెట్‌లో కేవలం పది రోజుల్లోనే టమోటా ధరలు అమాంతం పడిపోయి రైతులకు కష్టాలు చూపిస్తూ నష్టాలకు గురి చేస్తోంది. పది రోజుల క్రితం టమోటా కిలో గరిష్ఠంగా కిలో రూ.88 పలికిన ధరలు కేవలం పది రోజుల్లోనే కనిష్ఠంగా కిలో ధర రూ.30కు పడిపోవడం గమనార్హం. మదనపల్లె మార్కెట్ యార్డులో పది రోజుల క్రితం వరకు నిత్యం 600 నుంచి 700 మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి వచ్చేది. కాలక్రమంలో మదనపల్లె ప్రాంతంలో పంట దిగుబడి రెట్టింపు అవుతూ వస్తోంది. ఈ క్రమంలో సోమవారం మదనపల్లె మార్కెట్‌కు 1424 మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి రావడం గమనార్హం. దీంతో నాణ్యమైన మొదటి రకం టమోటా ధర గరిష్ఠంగా కిలో రూ.48 పలకగా, రెండో రకం టమోటా కనిష్ఠంగా కిలో రూ.30 పలికింది. దీంతో వచ్చే రోజుల్లో టమోటా దిగుబడి ఇదే రీతిలో పెరిగితే టమోటా ధరలు కిలోకు రూ.10కి పడిపోయినా ఆశ్చర్యం పోనవసరం లేదని వ్యాపారులు అంటున్నారు.


మదనపల్లె మార్కెట్‌కు పెద్దఎత్తున విక్రయానికి వచ్చిన టమోటా

స్వగ్రామంలో లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం, జూలై 1: ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ఉమ్మడి లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి తమ స్వగ్రామమైన టి.సదుం పంచాయతీ పరిధిలోని చెన్నరాయునిపల్లెకు సోమవారం చేరుకున్నారు. చెన్నరాయునిపల్లెలో తమ సమీప బంధువుల ఇంటిలో జరుగుతున్న ఓ శుభకార్యానికి వచ్చినట్లు ములకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి నాలుగు రోజులు గ్రామంలోనే ఉంటారని అనంతరం కర్నూలుకు వెళతారని ఆయన చెప్పారు. సోమవారం లక్ష్మణ్‌రెడ్డి స్వగ్రామానికి చేరుకోవడంతో స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. నాలుగు రోజులు లక్ష్మణ్‌రెడ్డి భద్రత కోసం పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు.


చెన్నరాయునిపల్లెలో జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న రెవెన్యూ అధికారులు

పింఛన్లతో ప్రారంభమైన సంక్షేమం

- జగన్‌కు మతిభ్రమించి ఈవీఎంలపై విమర్శ
- గత ప్రభుత్వం మాదిరి కక్షసాధింపు చర్యలు ఉండవు
- జిల్లా అధ్యక్షుడు వాసు, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి

పులివెందుల టౌన్, జూలై 1: రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంతో పండగ వాతావరణం నెలకొందని, ప్రతి అవ్వ తాత ముఖాల్లో ఆనందాన్ని చూస్తున్నామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి (వాసు), ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, టీడీపీ పులి వెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి)లు అన్నారు. సోమవారం డీఎన్ రెడ్డి నివాసంలో వారు విలే కరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం వచ్చిన వెంటనే పింఛన్లను సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అందించడం జరిగిందన్నారు. మొదట పింఛన్‌కు శ్రీకారం చుట్టింది టీడీపీ ప్రభుత్వం అని, అప్పట్లో రూ.30లు ఉండేదని, వైఎస్సార్ రూ.200 చేశారని, మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని రూ.2000లకు చేశారన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.3000 చేస్తామని ఎన్నికల్లో చెప్పి.. ఒకేసారి ఇవ్వకుండా ఏదో భిక్షం ఇస్తున్నట్లు రూ.250 పెంచుతూ పోతూ నాలుగు సంవత్సరాలో రూ.3000 ఇచ్చారన్నారు. కానీ 2024లో ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారంలో పింఛన్లు రూ.4000 చేస్తామని అది కూడా ఏప్రిల్, మే, జూన్ మాసాలు కలిపి ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఆ మాట మేరకు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ మూడు నెలలు కలిపి మొత్తం రూ.7000లు ఇవ్వడం జరిగిందన్నారు. పింఛన్లతో సంక్షేమం ప్రారంభమైందని.. ఎన్నికలలో చెప్పిన హామీలన్నింటిని త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేరుస్తారన్నారు. ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమంతో ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారు ఎన్నో ఇబ్బందులు పడ్డార న్నారు. పులివెందులను ఏమాత్రం అభివృద్ధి చేయ లేదని, ఒక సుందీకరణ తప్ప ఇక్కడేమీ జరగలేదన్నారు. 2024 ఎన్నికల్లో ఇక్కడ ప్రజలు ఆయనకు 60వేల ఓట్లు మెజార్టీతో గెలిపించారన్నారు. కానీ మరింత మేము మంచి చేసే విధంగా పులివెందుల ప్రజల మన్ననలు పొందుతామని.. ప్రజలు ఈసారి సహకరించాలన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతం కాంట్రాక్టర్లు, కౌన్సిలర్లు జగన్ వచ్చినపుడు ఆయన దగ్గరికి వెళ్లి బిల్లులకు సంబంధించి అడుగుతున్నట్లు తెలిసిం దని, వైసీపీ ప్రభుత్వం చేసిన విధంగా టీడీపీ ప్రభుత్వంలో ఆ విధంగా ఉండదన్నారు. టీడీపీ నాయకులు చేసిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకుండా జగన్ ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు పెట్టిందన్నారు. మా ప్రభుత్వంలో ఆ విధంగా కక్షసాధింపు చర్యలు ఉండవన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కూటమి 164 సీట్లు సాధించడంతో జగన్‌కు మతిభ్రమించిపోయి ఈవీఎంలపై విమర్శ చేస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో భూకబ్జాలు, అరాచకాలు చూసి ప్రజలు ఓటుతో ఆయనకు బుద్ధి చెప్పారన్నారు. గండి క్షేత్రంలో జరిగిన అవినీతిపై విచా రణ జరుగుతుందన్నారు. అలాగే పాడాలో అవినీతి జరిగిన ప్రతి విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థ సారధిరెడ్డి, టీడీపీ నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తూగుట్ల మధు సూదన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, మాబాషా, భాస్కర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, మైసూరారెడ్డి, బాబా ఫక్రుద్దీన్, వెంకటేష్, రహంతుల్లా, జనసేన నాయకులు ముని జగదీష్‌బాబు, బాబా, నాగార్జున, అంజి, నాగరాజు, గౌసియ, విశ్వనాథ్ తితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా రాజేష్‌కుమార్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 1: వైఎస్‌ఆర్ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ఎన్.రాజేష్‌కుమార్‌రెడ్డిని ఉన్నత విద్యా మండలి నియమిచింది. ఈ మేరకు సోమవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. అయనకు సూర్యచారి టబుల్‌ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ ఎం.ప్రభాకర్, గౌరవ సలహాదారు డాక్టర్ పుత్తా జయ ప్రకాశ్‌రెడ్డి సత్కరించారు. ద్రావిడ విశ్వవిద్యాలయం నుంచి డిప్యుటేషన్‌పై డిప్యూటీ రిజిస్ట్రారుగా వచ్చి సేవలందిస్తున్న ఆయనను రిజిస్ట్రారుగా నియమించడం సంతోషదాయకమన్నారు. ప్రభుత్వం మారిన సందర్భంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో రాజేష్ కుమార్‌రెడ్డిని ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా నియమించారు.

10 లోపు డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల రుసుం చెల్లించాలి

వైవీయూ పరిధిలోని డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలకు విద్యార్థులు ఈనెల 10లోపు ఫీజులు చెల్లించి ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. 1,2,3,4 సెమిస్టర్లలో ఒక్కో పేపరు ఐదో సెమిస్టరు అన్ని పేపర్లు రాసుకునే అవకాశం కల్పించామన్నారు. పరీక్ష రుసుం పేపరుకు రూ.2వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వైవీయూ పీజీ సెమిస్టరు పరీక్షల తనిఖీ



పరీక్షలను తనిఖీ నిర్వహిస్తున్న ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి

వైవీయూ పీజీ సెమిస్టరు పరీక్షలను ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జా మినేసన్ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. పోస్టుగ్రాడ్యుయేషన్ పరీక్షలు ప్రతి నెలా 28 నుంచి నిర్వహిస్తున్నారు. పలువురు విద్యార్థుల హాల్‌టికెట్లను ఆయన పరిశీలించారు.

వైవీయూ అభివృద్ధికి సహకరించాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 1: వైవీయూ అభివృద్ధికి సహకరించాలని వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రారు ప్రొఫెసరు ఎస్.రఘునాథరెడ్డి కోరారు. సోమవారం ఆయన కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైవీయూ అభివృద్ధికి సహకరించాలని కోరగా.. ప్రభుత్వ విధానాల ప్రకారం యూనివర్సిటీ ప్రగతికి పూర్తి సహకారం అందిస్తామన్న హామీతో పాటు, విద్యాసంస్థల అభివృద్ధికి తాము ముందుంటానని చెప్పారన్నారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకుడు పుత్తాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రెండు ఆటోలు ఢీ- మహిళ మృతి

- ఇరువురికి తీవ్ర గాయాలు



మృతి చెందిన కరీమున్నీసా

రామాపురం, జూలై 1: మండలంలోని నల్ల గుట్టపల్లి పంచాయతీ ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఆదివారం రాత్రి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పఠాన్ కరీమున్నీసా (82) అనే వృద్ధురాలు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... కడప పట్టణానికి చెందిన పఠాన్ కరీమున్నీసా, పఠాన్ మస్తాన్‌బీ, షావలీలు కలిసి ఆటోలో కడప నుంచి చిన్నమండెంకు వెళ్తుండగా నల్లగుట్టపల్లి పంచాయతీ ఆంజనేయస్వామి గుడి వద్దకు రాగానే ఎదురుగా రాయచోటి వైపు నుంచి రామాపురం వైపు వస్తున్న మరో ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో కరీమున్నీసా, పఠాన్ మస్తాన్‌బీ, షావలీలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కరీమున్నీషా సోమవారం మృతి చెందంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

సికెదిన్నె, జూలై 1: చికిత్స పొందుతూ మహబూబ్‌చాంద్ (17) అనే విద్యార్థి మృతి చెందినట్లు సీకేదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. సీఐ వివరాల మేరకు పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన మహబూబ్‌చాంద్ చింతకొమ్మదిన్నె మండలం అంగడివీధిలోని చిన్నమ్మ జమాల్‌బీ వద్ద ఉంటూ చదువుకుంటూ ఉండేదని, ప్రస్తుతం ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతుండగా ఇంటర్ సప్లిమెంటరీలో ఫెయిల్ కావడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురై ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఐరన్ మాత్రలు వేసుకోవడంతో అస్వస్థతకు గురైంది. చికిత్స కోసం వేలూరు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందిందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

21 మిల్టరీ మద్యం బాటిళ్లు స్వాధీనం

ముద్దనూరు జూలై 1 : మండల పరిధి పులివెందుల రోడ్డులోని చిన్నదుద్యాల క్రాస్ వద్ద అక్రమంగా మిల్టరీ మద్యం బాటిళ్లు తరలిస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్‌సీఐ గడ్డం నాయుడు తెలిపారు. సీఐ సమాచారం మేరకు వివరాలు...బెంగళూరు నుంచి బస్సులో ఇద్దరు వ్యక్తులు గత నెల 29వ తేదీ 21 అక్రమంగామిల్టరీ మద్యం బాటిళ్లు తరలిస్తున్నారు. రాబడిన సమాచారం మేరకు దాడి చేసి తనిఖీ చేయగా తాడిపత్రికి చెందిన వసుందరరెడ్డి వద్ద 10 బాటిళ్లు, నల్లబల్లె గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి వద్ద నుంచి 11 మద్యం బాటిళ్లస్వాధీనం చేసుకొని ఇరువురి పై కేసు నమోదు చేసి, స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు సీఐ తెలిపారు. అయితే సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో మిల్టరీ అక్రమ మద్యం బాటిళ్ల పట్టివేత కథనం రావడంతో స్పందించారు. 80 మిల్టరీ అక్రమ మద్యం బాటిళ్లు కాదని.. 21 మాత్రమే పట్టుబడినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి



మృతి చెందిన ఉపాధ్యాయుడు బాలక్రిష్ణ, బాలక్రిష్ణ (ఫైల్‌ఫొటో)

బద్వేలుటౌన్, జూలై 1: బద్వేలు పట్టణ పరిధిలోని కుమ్మరికొట్టాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు గొడ్లవీటి బాలక్రిష్ణ(49) అక్కడిక్కడే మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు.. మృతుడు గొడ్లవీటి బాలక్రిష్ణ సురేంద్రనగర్‌లో నివాసం ఉంటూ బ్రహ్మంగారిమఠం మండలం పెద్దిరాజుపల్లెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తుండేవాడు. సోమవారం విధులు పూర్తి చేసుకొని ఇంటికి వచ్చిన అనంతరం పాలకోసం రోడ్డుపై నడిచివెళుతుండగా టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు బాలక్రిష్ణకు భార్య గీతా విజయలక్ష్మి, కుమార్తె కావ్యశ్రీ, కుమారులు యోగేశ్వర్, రాజ్ కుమార్‌లు సంతానం కలరు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బద్వేలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల విద్యార్థినుల ప్రతిభ

- జాతీయ, అంతర్జాతీయ యూనివర్సిటీల్లో ప్రవేశం



ప్రతిభ చూపిన విద్యార్థినులు చింతా శ్రీలేఖ, కోనప్పగారి చైతన్య

పులివెందుల రూరల్, జూలై 1: పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళా శాల విద్యార్థినులు ఉత్త మ ప్రతిభ చూపి జాతీ య, అంతర్జాతీయ యూని వర్సిటీల్లో ప్రవేశం పొందా రని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ బేగ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కళాశా లలో నాల్గవ సంవత్సరం విద్యా ర్థిని చింతా శ్రీలేఖ ఆంధ్రప్రదేశ్ పీజీసెట్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలో రాష్ట్రం లోనే ప్రథమ ర్యాంకు సాధించిందన్నారు. అలాగే ఆల్ ఇండియా గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్) టెస్ట్‌లో ఉత్తమ ర్యాంకు సంపాదించి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐసీటీ) ముంబైలో మెరిట్ ఆధారంగా సీటు పొందిందన్నారు. వివిధ రాష్ట్రాల వ్యవ సాయ యూనివర్సిటీల మధ్య జోనల్ లెవెల్లో నిర్వహించిన ఉపన్యాస పోటీలలో రెండోస్థానం పొంది తద్వారా జాతీయంగా అగ్రికల్చర్ సైన్స్ కాంగ్రెస్, కేరళలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో యూనవర్సిటీ తరపున పాల్గొందన్నారు. అలాగే నాల్గవ సంవత్సరం మరో విద్యార్థిని కోనప్పగారి చైతన్య విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు జీఆర్‌ఈ, టోఫెల్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ జార్జియాలో ఎంఎస్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చదివేందుకు సీటు పొందిందన్నారు.

దివ్యాంగులకు చేయూతను అందిద్దాం : డీఈవో



దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, జూలై 1: దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా వారిని ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి తెలి పారు. సోమవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్థన్ ఆధ్వర్యంలో 6 నుంచి 18 ఏళ్ల లోపు దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు (పరికరాలు) పంపిణీ కోసం నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి, సుండుపల్లె, వీరబల్లి, రామాపురం, సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాల్లోని దాదాపుగా వంద మందికిపైగా దివ్యాంగ పిల్లలకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించామన్నారు. నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకున్న ప్రతి పిల్లవానికి అవసరమయ్యే వీల్‌చైర్, సీపీచైర్, ట్రైసైకిల్, వినికిడి యంత్రాలు, రొలేటర్స్ ఇతరత్ర పరికరాలను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ప్రతి మండలంలోనూ దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక విద్యను అందించేందుకు భవిత కేంద్రాలు ఉన్నాయని, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ నిర్ధారణ శిబిరంలో ఈఎన్టీ వైద్యు లు ఏఆర్ నరసింహారావు, ఆర్థో వైద్యులు రాజఅహ్మద్, ఆడియాలజిస్ట్ త్రిలోక్య, జనరల్ వైద్యులు రామరాజు, ఫిజియోథెరపిస్ట్ రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్త నేర చట్టాలతో ప్రజల హక్కులకు విఘాతం

- భారత న్యాయవాదులు సంఘం



కొత్త చట్టాలకు వ్యతిరేకంగా అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, జూలై 1: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నేరచట్టాలు ప్రజల హక్కులను హరించే విధంగా ఉన్నాయని.. వాటి అమలు తక్షణం ఆపివేయాలని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్యలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నేరచట్టాలను జూలై 1 నుంచి అమలు చేస్తున్న సందర్భంగా వారు అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా తీసుకొచ్చిన చట్టాలు ఏవైనప్పటికీ అప్పటి వరకు ఉన్న చట్టాల కంటే మెరుగ్గా ఉండాలి కానీ కొత్త నేర చట్టాలు ప్రజలు జీవించే హక్కును కాలరాసే విధంగా ఉన్నాయని, ఈచట్టాలను అమలు తక్షణం ఆపేయాలని వారు డిమాండ్ చేశారు. 95 శాతం వరకు పాత సెక్షన్లను నెంబర్లు మార్చడం ఐపీసీ, సీఆర్ పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌లకు దేశ ప్రజలందరికీ సంబంధం లేని భాషలో పేర్లు పెట్టి గందరగోళ పరిచే విధంగా ఉన్నాయని, వీటిని అర్థం చేసుకోవడానికి మరో 20 సంవత్సరాలు పట్టే అవకాశం ఉందన్నారు. నిపుణులతో కానీ పార్లమెంటులో గానీ సరైన పద్ధతిలో చర్చించకుండానే చట్టాలను తయారు చేశారన్నారు. నేరాన్ని బట్టి శిక్షను ఖరారు చేసే న్యాయవ్యవస్థ విచక్షణ అధికారాన్ని కొత్త నేర చట్టం తొలగించిందని, దీన్ని బట్టి న్యాయ వ్యవస్థపై అధిపత్యాన్ని చలాయించడం కోసమేనని ఈ చట్టాన్ని తీసుకొచ్చారని వారన్నారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోషియేషన్ సహాయ కార్యదర్శి డీ. నాగముని, సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్‌రాజు, ఆనంద్‌కుమార్, ధనుంజయ్‌కుమార్, కృష్ణయ్య, హుమయూన్‌బాషా, ప్రజా సంఘాల నాయకులు రామాంజనేయులు, అక్బర్‌అలీ, పామయ్య తదితరులు న్యాయవాదులకు మద్దతుగా పాల్గొన్నారు.

సంకేపల్లి బ్రిడ్జి పూర్తి చేసి 10 గ్రామాల సమస్య తీరుస్తాం..



సంకేపల్లి వద్ద ఆగిన బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి

కొండాపురం, జూలై 1: మండలంలోని సంకేపల్లి బ్రిడ్జి పూర్తి చేసి పెన్నానది అవలివైపున ఉన్న 10 గ్రామాల ప్రజల సమస్యలను తీరుస్తామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. గతంలో తాను శంకుస్థాపన చేసి ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. సుమారు రూ.39 కోట్లతో తాను మంత్రిగా ఉన్నప్పుడు బ్రిడ్జి పను లనకు శంకుస్థాపన చేశానన్నారు. అయితే గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వం ఈ బ్రిడ్జి పనులను నిలిపివేసిందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పెన్నానది అవలి గ్రామాల రాకపోకలకు మార్గం సులభం అవుతుందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల గండికోట బ్యాక్‌వాటర్ ఉన్నపుడు గాని, పెన్నా నీటితో గాని ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. దీంతో చుట్టూ 80 కిలోమీటర్లు తాడిపత్రి మీదుగా రావాల్సి వస్తుందని, వెంటనే బ్రిడ్జి పనులు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమా వేశం నిర్వహించి.. నీటి సమస్య తలెత్తకుండా తగిన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో శ్రీనివాసులు, డీఎల్‌డీవో సుబ్రమణ్యం, ఎంపీడీవో నాగప్రసాద్, తహ సీల్దార్ శ్రీనివాసులు ఎమ్మెల్యే సోదరుడు శివనారాయణరెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

అంతర్జాతీయస్థాయి చెస్ రేటింగ్స్‌లో కడప చిన్నారికి మెరుగైన రేటింగ్



కడప (స్పోర్ట్స్) జులై 1: అంతర్జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్ రేటింగ్స్‌లో కడప ఎన్‌జీవో కాలనీకి చెందిన చిన్నారి చెస్ క్రీడాకారిణి పసుపులేటి చిన్మయి (10) రేటింగ్ దక్కించుకుంది. ఇటీవల వెస్ట్‌గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫైడ్ ఓపెన్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ఇంటర్నేషనల్ ప్లేయర్స్‌తో చిన్మయి పోటీపడి పది పాయింట్లకు ఐదున్నర పాయింట్లు సాధించి 1523 రేటింగ్ దక్కించుకుంది. ఇందుకు ప్రధానంగా కోచ్ అరుణ్‌కుమార్ సహకారంతో సాధ్యమయిందని చిన్నారి తల్లిదండ్రులు ఉమా మహేష్‌బాబు, శ్రీలక్ష్మి వెల్లడించారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు

తంబళ్లపల్లె, జూలై 1: జింకపై కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు...తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని చేలూరివాండ్లపల్లె పొలాల్లోకి సోమవారం సాయంత్రం ఓ జింక వచ్చింది. దాన్ని పసిగట్టిన కుక్కలు తరుముకుని గాయపరిచాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానిక టీడీపీ నాయకుడు పురుషోత్తం, గ్రామస్థులు జింకను కుక్కల బారి నుంచి రక్షించి తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి వెంకట్రామయ్యకు సమాచారం ఇచ్చారు. వెంటనే వెంకట్రామయ్య పశువైద్యుడు కిరణ్ ద్వారా జింకకు చికిత్సలు అందించారు. అనంతరం గ్రామస్థులు జింకను అటవీశాఖాధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

రేపు బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె టౌన్, జూలై 1: అన్నమయ్య జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్లను మదనపల్లె మండలం పోతబోలు వేద పాఠశాలలో బుధవారం ఎంపిక చేయ నున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు దిలీప్‌కుమార్, మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జూని యర్ బాలికలు, సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్లు ఎంపిక చేస్తామ న్నారు. ఈ ఎంపిక కార్యక్రమానికి హాజరయ్యే క్రీడాకారిణులు వారి ఆధార్‌కార్డు, పుట్టినరోజు సర్టిఫికెట్ తప్పని సరిగా తీసుకురావాలన్నారు.

పాడా ఇన్‌చార్జి ఓఎస్డీగా కె.వెంకటరావు



పులివెందుల, జూలై 1: పులివెందుల అర్బన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (పాడా) ఇన్‌చార్జి ఓఎస్డీగా కె.వెంకటరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డి బదిలీ కాగా ఆయన విజయవాడలోని జేపీడీలో రిపోర్ట్ చేశారు. ఇన్‌చార్జి ఓఎస్డీగా బాధ్యతలు చేపట్టిన వెంకటరావు కడపలోని చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా కొన సాగుతున్నారు. పాడా ఓఎస్డీగా అదనపు బాధ్యతలు అప్పగిం చారు. కార్యక్రమంలో పాడా ఏఓ రామాంజనేయరెడ్డి, అకౌంటెంట్ నీలకంఠారెడ్డి, నూతన ఓఎస్డీకి సాదర స్వాగతం పలికారు.

జీజీహెచ్‌లో ఘనంగా డాక్టర్స్ డే



డాక్టర్స్‌డే సందర్భంగా కేక్ కటింగ్ చేస్తున్న వైద్యులు

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 1 : కడప నగర పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సోమవారం డాక్టర్స్‌డే నిర్వహించారు. వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సురేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, వెల కట్టలేనిదని, మరో వృత్తితో పోల్చ లేనిది అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ రాజేశ్వరి, హెచ్ ఓడీ డాక్టర్ యాదవేంద్రరెడ్డి, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.







రాయచోటి 31వ వార్డులో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న గాజుల ఖాదర్‌బాషా, లక్కిరెడ్డిపల్లెలో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, గాలివీడు నాయునివారిపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్, రామాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, సంబేపల్లెలో పింఛన్ల పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఊరువాడ పింఛన్ల సంబరం

- పేదలకు అండగా
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం

రాయచోటిటౌన్, జూలై 1: ఎన్నికల సమయంలో అవ్వాతాతలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు సోమవారం రూ.7 వేలు పింఛను అందజేయడం హర్షించదగ్గ విషయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. సీఎం చంద్రబాబు పిలుపుతో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని 30, 31, 33 వార్డుల్లో ఆయన అవ్వాతాతలకు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే శిబ్యాల గ్రామం అనుంపల్లెలో మాజీ జడ్పీటీసీ సరోజమ్మ, 19వ వార్డులో టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డెయ్యలు, 9వ వార్డులో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్వర్‌బాషా, 32వ వార్డు పాతరాయచోటిలో టీడీపీ నాయకులు సతీశ్, శివప్రసాద్, మహేశ్, సాయి, 22వ వార్డులో వీరభద్రస్వామి ఆలయ మాజీ చైర్మన్ ఎద్దుల లక్ష్మీప్రసాద్, 11వ వార్డులో మాజీ కౌన్సిలర్ ముస్తాక్, 30, 31వ వార్డుల్లో ఆర్డీవో రంగస్వామి, మున్సిపల్ కమిషన్ వాసుబాబు, టీడీపీ యువనేత రాహుల్‌రెడ్డి, మహబూబ్‌అలీఖాన్‌లు, పట్టణంలోని కొత్తపేట రామాపురంలో రిటైర్డ్ ఈవోపీఆర్డీ జయసింహారెడ్డి, 24వ వార్డులో కౌన్సిలర్ భారతి, టీడీపీ పట్టణ అధ్యక్షులు ఖాదర్‌వలీల ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాహుల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రషీద్, సంజీవరెడ్డి, టీడీపీ నేతలు శ్రీనివాసులరెడ్డి, జాఫర్‌ఖాన్, గయాస్‌బాషా, మహమ్మద్ పెద్దఎత్తున పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లెలో మాజీ ఎంపీటీసీ మదన్ మోహన్, ఆరీఫుల్లా ఆధ్వర్యంలో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే రాజంపేట పార్లమెంటు డాక్టర్ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పింఛను తీసుకున్న లబ్ధిదారులు చంద్రబాబుకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో దళితవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు మసూద్, మల్లికార్జునగౌడ్, జయచంద్రారెడ్డి, కాంట్రాక్ వెంకటరామారాజు రాష్ట్ర వికలాంగుల అధ్యక్షుడు వెంకటరామారాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

గాలివీడు: మండలంలోని వివిధ గ్రామాల్లో సచివాలయం సిబ్బందితో కలిసి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని సోమవారం నల్లగుట్టపల్లె, సరస్వతిపల్లె, సుద్దమళ్ల, గువ్వలచెరువు, నీలకంఠ్రావుపేట, గోపగుడిపల్లె, కల్పనాయునిచెరువు, రాచపల్లి, హసనాపురం, బండపల్లి, చిట్లూరు, కుమ్మరపల్లె గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి చంద్రమౌళిలు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, నల్లగుట్టపల్లె మాజీ ఎంపీటీసీ రవికుమార్‌రెడ్డి, రాజంపేట టీడీపీ ఉపాధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె: మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు సచివాలయ సిబ్బంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందజేశారు. శెట్టిపల్లి, ఎస్.సోమవరం, దేవపట్ల, రౌతుకుంట గ్రామాల్లో పింఛన్లు పంపిణీ కార్యక్రమం జరిగింది.

చిన్నమండెం: మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల్లో పింఛన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితారెడ్డి చిన్నమండెం, బోనమల, దేవగుడిపల్లి, కొత్తపల్లి, చాకిబండ, వండాడి గ్రామ పంచాయతీల్లో పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి రమణారెడ్డి, జిల్లా జీఎస్ డబ్ల్యుఎస్ అధికారి, ఎంపీడీవో రామకృష్ణలు బోనమల గ్రామంలో సందర్శించి పింఛన్ పంపిణీ పరిశీలించారు.

రాజంపేట: రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో పెన్షన్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పండుగ వాతావరణంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు అట్టహాసంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజంపేట, సుండుపల్లె, వీరబల్లి, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా రాజంపేట మండలంలోని ఊటుకూరు గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సుగవాసి బాలసుబ్రమణ్యం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మండల మాజీ ఉపాధ్యక్షులు నాగా సుధాకర్‌రెడ్డి, మలిశెట్టి సుబ్బరాయుడు, చెంగల్‌రాయులు, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట మండలంలోని పలు ప్రాంతాల్లో

మండలంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నేతలు పెన్షన్ పంపిణీ చేశారు. రాజంపేట పట్టణం సాతుపల్లెలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గీతాంజలి రమణ, షామీర్‌బాషా, జడ శివ ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ చేశారు. రాజంపేట పట్టణం నారపురెడ్డిపల్లెలో రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి శ్రీనివాసుల ఆధ్వర్యంలో, మదనగోపాలపురంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో, భువనగిరిపల్లె గ్రామంలో మైనార్టీ నాయకులు గుల్జార్‌బాషా ఆధ్వర్యంలో పెన్షన్‌లు పంపిణీ చేశారు. అగ్రహారంలో సుధాకర్ తదితరులు పెన్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఊటుకూరు మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో

ఊటుకూరు మాజీ సర్పంచ్ మన్నేరు లక్ష్మీనరసయ్య, కోలాటం నరసింహ, హరిక్రిష్ణ, కావేరిగారి వెంకటరమణ, జనసేన పార్టీ వార్డు మెంబర్లు కసారపు నరేష్, కోలాటం వెంకటరమణ, జనసేన నాయకులు నామా శంకర, బండ్ల నాగరాజు, కంబాయిగారి సురేంద్ర, మల్లెం శ్రీనాధ్, పూల యశురాం, సునీల్ నల్లంశెట్టి, క్రిష్ణయ్య నల్లంశెట్టి, మల్లికార్జున నల్లంశెట్టి, నందీశ్వర, విజయ్, బాలురాయ్ కంబాయిగారి, మల్లి ఏనుగుల, భువనగిరి గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో పెన్షన్‌లు పంపిణీ చేశారు.

నందలూరు: నిరుపేదలకు వరం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలోని రోడ్ల భవనాల అతిథి గృహంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. నందలూరులో ఆర్టీసీ మాజీ రీజనల్ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, మాజీ ఎంపీపీ పల్లె సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఒంటిమిట్ట: మండలంలోని టీడీపీ సీనియర్ నాయకులు కొమరా వెంకటనరసయ్య, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షులు గజ్జుల నరసింహారెడ్డి, కాంట్రాక్టర్ రమణ, బొబ్బిలి రాయుడు ఆధ్వర్యంలో గంగపేరూరు, పెన్నపేరూరు సచివాలయ సిబ్బందితో పింఛను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సాయి, యశ్వంత్, చంద్ర, టీడీపీ నాయకులు రామదాసు, మామిళ్ల ఈశ్వరయ్య, మోదుగల నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: మండల పరిధిలోని తుమ్మకొండ పంచాయతీ మిట్టమీదపల్లె జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మాజీ ఎంపీపీ గుండయ్యనాయుడుతో కలిసి టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి పెన్షన్ పంపిణీ చేశారు. అలాగే టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్, తాతంశెట్టి నాగేంద్రలు నాగవరం పంచాయతీలో పింఛన్ల పంపిణీ చేశారు.

రామాపురం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని చిట్లూరు గ్రామ పంచాయతీ చిట్లూరు కస్బా, పాలన్నగారిపల్లె గ్రామల్లో సోమవారం రాయచోటి ఆర్డీవో రంగస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పింఛన్ పంపిణీ చేసే సిబ్బందితో మాట్లాడుతూ పింఛన్ పంపిణీ చేసే అధికారులు లబ్ధిదారులు వారి వారి ఇండ్ల వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాలన్నారు.

సుండుపల్లె: రాష్ట్రంలో పింఛన్‌దారుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు ప్రాధాన్యత కల్పిస్తున్నారని టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఇన్‌చార్జి బాలసుబ్రమణ్యం తెలిపారు. వినాయక నగర్‌లో వృద్ధులు, వికలాంగులు, పింఛన్‌దారులతో కలిసి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పింఛన్ పంపిణీ చేశారు.

పుల్లంపేట: మండలంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం వాడవాడలా సచివాలయ ఉద్యోగులు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి పండుగలా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కోడలు శిరీషారెడ్డి ఆధ్వర్యంలో పుల్లంపేట, టి.కమ్మపల్లె, రెడ్డిపల్లె గ్రామాల్లో కూటమి నాయకులు పింఛను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. రెడ్డిపల్లెలో ముక్కా శిరీషారెడ్డి సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఓబులవారిపల్లె: సీఎం చంద్రబాబు చెప్పిన మాట ప్రకారం జూలై ఒకటినాడు పెంచిన పెన్షన్లను ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పేరిట ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చిన్నఓరంపాడు, ఓబులవారిపల్లె, బొమ్మవరం, మంగళంపల్లె, కాకర్లవారిపల్లె, బోటుమీదపల్లె, మంగంపేట, గాదెల, వై.కోట తదితర గ్రామ పంచాయతీల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

సిద్దవటం: మండలంలోని బొగ్గుడివారిపల్లె పంచాయతీ పాలకొండ్రాయునిపల్లెలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఎన్టీఆర్ పింఛను పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, జనసేన నేత అతికారి క్రిష్ణలు, తహశీల్దారు మురాద్వావలి, వీఆర్ఒ రేణుక, పంచాయతి సెక్రటరి సుజాత, కూటమి నాయకులు పాల్గొన్నారు.







సుండుపల్లెలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రాజంపేట ఇన్‌చార్జి బాలసుబ్రమణ్యం, నందలూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎద్దల సుబ్బరాయుడు, చిట్వేలి తుమ్మకొండ పంచాయతీలో పింఛను పంపిణీ చేస్తున్న రూపానందరెడ్డి, రామాపురంలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రంగస్వామి, రాజంపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న లక్ష్మీనరసయ్య తదితరులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జిగా త్యాగరాజు

రాయచోటిటౌన్, జూలై 1: జిల్లాలోని ఎనిమిది వ్యవసాయ మార్కెట్ కమిటీల పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా మార్కెటింగ్ అధికారి త్యాగరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి సభ్యులను ప్రభుత్వం రద్దు చేస్తూ జూన్ 28న ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో జిల్లాలోని రైల్వేకోడూరు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, పీలేరు, అంగళ్లు వ్యవసాయ మార్కెట్ కమిటీల కాలపరిమితి ముగిసింది. అలాగే మదనపల్లె, రాజంపేట, వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు వ్యక్తిగత కారణాలతో ఇటీవల రాజీనామా చేశారు. పరిపాలన సౌలభ్యం కొరకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఉత్తర్వులు జారీ చేసింది.

డెంగ్యూ, అతిసార వ్యాధులపై అవగాహన

సంబేపల్లె, జూలై 1: డెంగ్యూ, అతిసార వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూపర్‌వైజర్ సదాశివరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్ తెలిపారు. డాక్టర్లు సత్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డిల ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని దుద్యాల గ్రామం పొట్టిరెడ్డిగారిపల్లెలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో డెంగ్యూ అతిసార వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలి

సంబేపల్లె, జూలై 1: నూతన ప్రభుత్వం 2024 జూలై 1 నుంచి కొత్తగా ప్రవేశపెట్టిన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం సంబేపల్లెలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పాత చట్టాలను సవరించి మూడు కొత్త చట్టాలను రూపొందించిందన్నారు. కొత్త చట్టాల ద్వారా సత్వరమే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. గతంలో తప్పు చేసిన వారికి తక్కువ జరిమానా విధించేవారని, ఇప్పుడు ఆ విధంగా ఉండదని తప్పును బట్టి జరిమానా, శిక్షలు పెరిగే విధంగా చట్టాన్ని రూపొందించారన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యాయత్నాలు వంటి కేసులకు యావజ్జీవ శిక్షతో పాటు మరణ శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. హెల్మెట్ లేకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. 18 సంవత్సరాలలోపు మైనర్లు వాహనాన్ని నడిపితే మైనర్లతో పాటు తల్లిదండ్రులకు శిక్ష తప్పదని తెలిపారు. కొత్త చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, మండలంలోని ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీధర్

అభ్యర్థులు తుది వ్యయ రిజిష్టర్లను అందించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు, జాయింట్ కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), జూలై 1: సార్వత్రిక ఎన్నికలు-2024లో అన్నమయ్య జిల్లాలో పోటీ చేసిన అభ్యర్థులు వారి తుది వ్యయ రిజిష్టర్లను పూర్తి స్థాయిలో సమర్పించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు, జాయింట్ కలెక్టరు రవీంద్రకుమార్, వైభవ్‌శుక్లలు పేర్కొన్నారు. సోమవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలులో ఆరు నియోజకవర్గాల, పార్లమెంట్‌కు పోటీ చేసిన అభ్యర్థులకు ఎన్నికల పరిశీలకులు, జాయింట్ కలెక్టర్ కలసి తుది వ్యయ రిజిష్టర్ రీకన్సిలేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యయ పరిశీలకులు ఇచ్చిన ఆదేశాల మేరకు ఏ అభ్యర్థికైనా విభిన్న అభిప్రాయాలు వుంటే సంబంధిత పత్రాలు సమర్పించి వారి తుది వ్యయ నివేదికలను తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యయ పరిశీలన కమిటీ నోడల్ అధికారి నాగరాజ మాట్లాడుతూ జిల్లాలో పోటీ చేసిన అభ్యర్థులు వారి తుది వ్యయ రిజిష్టర్లను పూర్తి స్థాయిలో సమర్పించాలని వారు తెలిపారు. సమావేశంలో సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొన్న అభ్యర్థులు, ఏజంట్లు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిని అరికట్టండి : సీడీపీఓ

చిట్వేలి, జూలై 1: ఐదు సంవత్సరాల లోపు పిల్లల మరణానికి అతిసార వ్యాధి కారణమని, దాన్ని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీవో రాజేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సంగాదేవిపల్లెలో అంగన్వాడీ కేంద్రం పరిసరాలను పరిశుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. గ్రామంలోని గర్భవతులు, బాలింతలు మూడు సంవత్సరాల పిల్లలకు పాలు పంపిణీ చేశారు. అనంతరం అతిసార వ్యాధి లక్షణాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీడీపీవో రాజేశ్వరి మాట్లాడుతూ అతిసారా వ్యాధి వైరస్ వల్ల వ్యాప్తి చెందుతున్నారు. ఈ కార్యక్రమంలో సంగాదేవిపల్లె ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్ గ్రేడ్-1, సూపర్‌వైజర్ విశాలాక్షి, అంగన్వాడీ వర్కర్‌లు సుబ్బలక్ష్మీ, సుబ్బరత్న, మహిళలు, పిల్లలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఓబులవారిపల్లె, జూలై 1: మంగంపేట పునరావాస ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తల్లెం రమణారెడ్డి కోరారు. ఈ మేరకు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిని ఆయన సోమవారం కలిసి రెగ్యులర్ ఎంప్లాయిమెంట్ సమాన పనికి సమాన వేతనం చెల్లింపులో జరిగిన లోటుపాట్లు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే ఏపీఎండీసీ సంస్థ పరిధిలోని ఆసుపత్రి సిబ్బంది పబ్లిక్‌స్కూల్లో పనిచేసే సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల గురించి టీడీపీ నాయకులు రమణారెడ్డి, పునరావాస కమిటీ అధ్యక్షుడు సగినాల సుబ్రమణ్యంలు తెలిపారు. వారు స్పందిస్తూ పదిరోజుల్లో విజయవాడలోని హెడ్ ఆఫీసులో ఎండీని కలిసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గల్లా వసంతకుమారి, గల్లా శ్రీను, మణి, రమణ, గల్లా రమణ, ఆసుపత్రి సిబ్బంది, ఏపీఎండీసీ సిబ్బంది రత్న, బుజ్జమ్మ, కన్నమ్మ, లత పాల్గొన్నారు.

'పెండింగ్ ప్యాకేజీలు ఇవ్వాలి'

ఓబులవారిపల్లె, జూలై 1: మంగంపేట గ్రామ పంచాయతీ ఆర్ఆర్-5 డేంజర్ జోన్ పరిధిలో నివసిస్తున్న ప్రజలకు పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీలను తక్షణమే చెల్లించి ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కోరారు. ఈ మేరకు రాజంపేట ఆర్డీఓకు సోమవారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీకేఎంయూ అధ్యక్షుడు పండుగోల మణి మాట్లాడుతూ మంగంపేట పరిధిలో హరిజనవాడ, అరుంధతివాడ, కాపుపల్లె గ్రామాల్లో ఇంకా కొంతమందికి ప్యాకేజీలు అందక నానా ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దారు కార్యాలయం, రాజంపేట ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ నాయకులు శంకరయ్య, వెంకటేశు, నరసింహులు పాల్గొన్నారు.



మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలపై కలెక్టరుకు ఫిర్యాదు

రాయచోటి(కలెక్టరేట్), జూలై 1: జిల్లాలోని గుర్రంకొండ టమాటా మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలపై సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రైతు సంఘం నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అక్రమాలపై రెండు సంవత్సరాలుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోలేదని వారు అర్జీలో పేర్కొన్నారు. ఒక రైతు 100 టమాట బాక్స్‌లు తీసుకొస్తే అందులో 20 జాక్‌పాట్, హమాలీ కూలీలని, కమీషన్లతో రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాలపై అక్కడున్న మార్కెట్ సిబ్బందికి, అధికారులకు ఎన్ని సార్లు వినతి పత్రం ఇచ్చినా ప్రయోజనం లేదని వారు కలెక్టర్‌కు విన్నవించారు.

ఫ్లెక్సీల చించివేతపై పోలీసులకు ఫిర్యాదు

పెనగలూరు, జూలై 1: మండలంలోని ఓబిలి క్రాస్‌రోడ్డులో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఓబుల హరిజనవాడకు చెందిన నాగభూషణం అనేవ్యక్తి శనివారం రాత్రి చించివేసినట్లు సోమవారం మండలంలో పర్యటించిన ముక్కా వరలక్ష్మీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె అక్కడే ఉన్న కానిస్టేబుల్ రామరాజు, సుజితల దృష్టికి తీసుకువచ్చారు. తమ కార్యకర్తలు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తారని ఎస్ఐ దానిపై కేసు నమోదు చేయాలని ఆమె పోలీసులను కోరారు. ఎవరి అభిమానం కొద్ది వారు ఫ్లెక్సీలను వేసుకుంటారని, అంతమాత్రాన కక్ష్యసాధింపుతో చించివేయడం భావ్యం కాదని ఈ సందర్భంగా ఆమె అన్నారు.

బలిజసేన మండల అధ్యక్షుడిగా వెంకటసుబ్బయ్య

పుల్లంపేట, జూలై 1: మండల బలిజసేన అధ్యక్షుడిగా కేతరాజుపల్లె గ్రామానికి చెందిన పంచగల వెంకటసుబ్బయ్యను నియమిస్తూ రాష్ట్ర బలిజసేన వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కాట్ క్రిష్ణప్రసాద్ ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మండలంలో బలిజసేన అభ్యున్నతికి కృషి చేసి బలిజల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఈ అవకాశం కల్పించిన అధ్యక్షుడు ఆర్కాట్ క్రిష్ణప్రసాద్, అనంతరాముల, నీలి ఈశ్వరయ్యలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

చట్టాల పట్ల అవగాహన ఉండాలి: ఎస్ఐ

నందలూరు, జూలై 1: చట్టాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ మహ్మద్అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ పోలీసుశాఖ సంయుక్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మారిన చట్టాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉంటే నేరాలను అరికట్టడం సులువు అవుతుందన్నారు. ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో సామాన్యులు, ఎఫ్ఐఆర్, ఎలక్ట్రానిక్ మోడ్‌లో నమోదు వల్ల చట్టాలు బాగా అమలవుతాయని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ సీలవేణి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ



చౌడేపల్లె పంచాయతీ గోసలకురపల్లెలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు వృద్ధుల పాలాభిషేకం

● పెన్షనర్ల మాట

పెరిగిన పింఛన్లతో భరోసా

పెరిగిన పింఛనుతో తమకు ఆర్థిక భరోసా లభించిందని పెన్షన్‌దారులు ఆనందం వ్యక్తంచేశారు. పింఛనే జీవనాధారమైన చాలామంది.. ఇక మూడుపూటలా తాము తినగలిగే పరిస్థితి వచ్చిందని సంబరపడ్డారు. వారి మాటల్లోనే.. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఇక బిడ్డలకు భారమవ్వను



అమ్మా.. ఇన్నాళ్లూ పింఛన్ సొమ్ము సరిపోక అరకొర జీవితాన్ని గడుపుతూ మందులకు ఇబ్బంది పడేదాన్ని. కష్టపడి జీవిస్తున్న బిడ్డలకు భారమయ్యాను. చంద్రబాబు దేవుడిలా మారి మాకు పింఛన్ పెంచారు. ఇక నా తిండికి, మాత్రలకు పించను సరిపోతుంది. బిడ్డలకు భారమవ్వను. చంద్రబాబు ప్రభుత్వానికి దండాలు. - మీనాక్షి, సదుం

నిద్రలేచేసరికి చేతికి డబ్బు



ఎన్నికల సమయంలో ఎంతో మంది ఇతర పార్టీల వాళ్లు వచ్చి చంద్రబాబు పింఛన్లు పెంచరు. సకాలంలో ఇంటి వద్ద అందించరంటూ దుష్ప్రచారం చేశారు. నేను నమ్మకపోయినా ఎక్కడో కాస్త సందేహం ఉండేది. నిద్ర లేచి బయటికి రాగానే సచివాలయ ఉద్యోగులు వచ్చి నా చేతిలో రూ.500 నోట్లు 14 పెట్టారు.

- వెంకటప్ప,దిగువగొర్రెలదొడ్డి, గంగవరం మండలం

ప్రశాంతంగా బతికేస్తా



ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కాలం గడుపుతుంటారు. కానీ, చంద్రబాబు మాత్రం పెన్షన్ పెంచడంతో పాటు బకాయిలు కలిపి రూ.7 వేలు అందించడం గొప్ప విషయం. ప్రస్తుత పరిస్థితుల్లో బంధువులు కూడా ఇలాంటి సాయం చేయరు. వందేళ్లు దాటిన నేను ఈ డబ్బుతో ప్రశాంతంగా బతికేస్తా. - అవుల మునెమ్మ, రామభద్రాపురం, గుడిపాల

నమ్మి గెలిపించాం



చంద్రబాబు ఎన్నికల సమయంలో పింఛన్లను పెంచతానన్నారు. చెప్పిన మాట ప్రకారం వెంటనే పింఛన్ పెంచారు. చంద్రబాబు మాటల్ని నమ్మి ఓటేసి గెలిపించాం. ఆయన మాట నిలబెట్టుకోవడంతో మాకు గర్వంగా ఉంది. - నామగిరిబాయి(90), తేరువీధి, పుంగనూరు

దర్జాగా జీవనం సాగిస్తా



చంద్రబాబు ఎన్నికల్లో చెప్పిన మాట నిలబెట్టుకున్నారు. గతంలో నాకు రూ.3 వేలు దివ్యాంగుల పింఛన్ వచ్చేది. ఇప్పుడు రూ.6 వేలు వస్తోంది. దీంతో ఏ చీకు చింతా లేకుండా, ఎవరికి భారమవ్వకుండా దర్జాగా బతికేస్తా. - దొరస్వామి, తాళంబేడు గ్రామం, చిత్తూరు రూరల్ మండలం

గత మూడు నెలలు ఇబ్బంది పెట్టారు



గడచిన మూడు నెలలు పింఛన్ కోసం బ్యాంకులు, సచివాలయాలు చుట్టూ తిరిగి ఎన్నో ఇబ్బందులు పడ్డాను. అప్పట్లో ఎండలు ఎక్కువగా ఉండడంతో సొమ్మసిల్లి పడిపోయాను. పింఛన్ కోసం వెళ్లిన నా వయసువారు బయటి ప్రాంతాల్లో చనిపోయారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.7 వేలను ఇళ్ల ఇవద్దే అందించడం ఆనందంగా ఉంది. రామరాజ్యం చంద్రబాబుతోనే సాధ్యం.

- అర్జునప్ప (90), యామగానిపల్లె, గుడుపల్లె మండలం

జీవితాంతం రుణపడి ఉంటాం



పదేళ్ల కిందట నా భర్త అనారోగ్యంతో మృతి చెందగా, అప్పటి నుంచీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న నాకు, ఈ పెంచిన పింఛన్ మందులకు ఉపయోగపడుతుంది. మాకు ఇంతటి మేలు చేసిన చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం.

- ఆయేషాబేగం, జవుకుపాళ్యం, బైరెడ్డిపల్లె మండలం

ఇంతకన్నా ఏం కావాలి



సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ డబ్బులు పెంచి, ఉద్యోగుల ద్వారా ఒకటో తేదీ ఉదయాన్నే అందించారు. గతంలో మాలాంటి వారికి ఇచ్చే రూ.3 వేలు పింఛన్‌ను ఇప్పుడు రూ.6 వేలకు పెంచారు. ఇక ఏ చీకూ చింతా లేకుండా ప్రశాంతంగా గడిపేస్తాం. ఇంతకన్నా ఏం కావాలి.

- నాగయ్య, దివ్యాంగుడు, వెదురుకుప్పం కాలనీ

'ఎన్టీఆర్ భరోసా' చారిత్రాత్మక ఘట్టం: ఎంపీ

చిత్తూరు సిటీ, జూలై 1: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఒకటో తేది పెంచిన పింఛన్ల పంపిణీని విజయవంతంగా నిర్వహించారన్నారు. జూలై నెల ఇవ్వాల్సిన రూ.4 వేల పింఛను, మూడు నెలల అరియర్స్ కలిపి రూ.7 వేలు అందుకున్న అవ్వా తాతల కళ్లల్లో ఆనందం చూశామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేయడం దేశ చరిత్రలో ఎక్కడా జరగలేదన్నారు.

16 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 1: గడచిన 24 గంటల్లో 16 మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పాలసముద్రంలో 30.2, కార్వేటినగరంలో 21.2, శ్రీరంగరాజపురంలో 18.8, రామకుప్పంలో 18.8, వి.కోటలో 18.0, నగరిలో 11.2, విజయపురంలో 10.8, కుప్పంలో 8.2, ఐరాలలో 5.2, వెదురుకుప్పంలో 4.2, నిండ్రలో 4.2, గుడిపాలలో 4.2, శాంతిపురంలో 3.6, పెనుమూరు, పూతలపట్టు, చిత్తూరు రూరల్‌లో 1.0మిమీ వంతున వర్షపాతం నమోదైంది.

కలెక్టర్ అటెండర్ ఆత్మహత్య



కుప్పుస్వామి (ఫైల్ ఫొటో)

చిత్తూరు, జూలై 1: కలెక్టర్ సుమిత్‌కుమార్ వద్ద అటెండర్‌గా పనిచేస్తున్న కుప్పుస్వామి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. సాంఘిక సంక్షేమశాఖకు చెందిన ఈయన డిప్యుటేషన్‌పై కొన్నేళ్లపాటు జేసీ-2 వద్ద అటెండర్‌గా పనిచేశారు. ఇటీవల కలెక్టర్‌కు అవసరం కావడంతో ఆయనకు అటెండర్‌గా చేరారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా సోమవారం ఉదయం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందారు. ఇతడికి భార్య, పిల్లలు ఉన్నారు.

ఇదే.. అప్పుడెందుకు సాధ్యం కాలేదు?

వలంటీర్లు లేకున్నా ఇళ్లకు పింఛన్లు ● ఉద్దేశపూర్వకంగా గత మూడు నెలలు ఇబ్బంది పెట్టిన ప్రభుత్వం

చిత్తూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అప్పటిలాగే ఇప్పుడూ వలంటీర్లు లేరు. సచివాలయ ఉద్యోగులూ అప్పటివారే. కానీ సోమవారం ఇంటింటికీ పింఛన్ల పంపిణీజరిగింది. అదే.. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎందుకు సాధ్యం కాలేదు. అంటే.. ఎన్నికల వేళ వైసీపీకి ఉపయోగపడేందుకే ఉద్దేశపూర్వకంగా పింఛన్ల పంపిణీలో వృద్ధులను ఇబ్బంది పెట్టారని తెలుస్తోంది. ఎన్నికల సమయంలో వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేస్తే ఓటర్లను ప్రలోభపెట్టే అవకాశముందని ఎన్నికల సంఘం భావించింది. దీంతో ఎన్నికల కోడ్ వచ్చాక వలంటీర్లతో పంపిణీ చేయొద్దంటూ ఆదేశాలిచ్చింది. దీన్ని వైసీపీ ఎన్నికల్లో తనకు అనుకూలంగా మార్చుకోవాలని భావించింది. పింఛన్ల పంపిణీని టీడీపీ అడ్డుకుందంటూ ప్రచారం చేసింది. సచివాలయాల వద్ద కొందరికి, బ్యాంకు ఖాతాలకు మరికొందరికి పింఛన్ సొమ్మును అందించి ఇబ్బంది పెట్టింది. అప్పట్లో ఎండలు అధికంగా ఉండడంతో పింఛన్ల కోసమని వెళ్లిన వృద్ధుల్లో.. గుడిపాల, కార్వేటినగరం మండలాల్లో ఇద్దరు వడదెబ్బ కారణంగా మృతి చెందారు. సచివాలయం.. ఇతర శాఖల ఉద్యోగులతో ఇళ్ల వద్దే పంపిణీ చేయమని టీడీపీ నాయకులు అధికారులకు వినతిపత్రాలను అందించి పోరాడిన ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చాక వలంటీర్లు లేకున్నా, సచివాలయ సిబ్బందితో ఒకరోజే 94శాతం మందికి పింఛన్లు అందించారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఇంటింటికీ పింఛన్లను అందించలేదని ఈ ఘటనతో తేలిపోయింది.



పడిపోయిన నన్ను లేపి నిలబెట్టాడు

'పదేళ్లయింది నా నడుం కింది బాగమంతా చచ్చుబడిపొయ్యి. కూలీనాలీ చేసుకుని బతికేవోడిని చెట్టుమిందినించి కింద పడి నడుం ఇరగ్గొట్టుకుండాను. అప్పుటినింకా నా బార్యే పోషిస్తావుండాది. పిల్లాపాపల్లేరు. నా పెళ్లాం కస్టం చూస్తావుంటే కళ్లల్లో నీళ్లు తిరగతా వుంటాయి. అయిదు వేలు పించిను వొస్తావుండింది కానీ, అది యాటికి చాలతాది? మా దేవుడు సెంద్రబాబు. చెప్పిన మాట చెల్లించుకున్నాడు. పించిను కాసులు 15 వేలు ఇంటికి వొచ్చి మరీ ఇచ్చి పొయ్యినారు టీడీపీ పుణ్యాత్ములు. సెంద్రప్పకు దండం పెట్టుకోవాల. నా పెళ్లాం ఇంగ కూడా కష్టపడాల్సిందే గానీ, నెలనెలా నాకొచ్చే పించిను కాసులతో ఆమె కష్టం కొంచిం తగ్గతంది. మా అన్న సెంద్రబాబు మా కుటుంబరాన్ని ఆదుకుండాడు. అందుకే లేవలేకపొయ్యినా, నా బార్య సగాయంతో లేచి ఈ చక్కాల కుర్చీలో కుచ్చోని మాయన్న ఫోటో కాడనే ఫోటో దిగతా వుండా. ఆయప్పకు ఏమిచ్చి రుణం తీర్చుకోవల్లో అర్తం గావడం ల్యా' అంటూ శాంతిపురం మండలం బోయినపల్లెకు చెందిన నారాయణప్ప భావోద్వేగంగా మాట్లాడారు. ఈయనకు వచ్చే పించనును మూడు రెట్లు పెంచి రూ.15 వేలు ఇవ్వడంతో ఆనందం వ్యక్తంచేశారు. - కుప్పం

ఏ తోడూ లేని నాకు రూ.6 వేలే ఆధారం



'పుట్టుకతో దివ్యాంగురాలిని. తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందారు. చెల్లెలు వివాహం చేసుకుని వెళ్లింది. నేను ఒంటరిగా జీవిస్తున్నాను. గతంలో వచ్చే రూ.3 వేల పింఛను సరిపోయేది కాదు. చంద్రన్న ప్రభుత్వం వస్తే రూ.6వేలు ఇస్తానని మాట ఇచ్చారు. ఆ మాటను నిలబెట్టుకుని ఉదయాన్నే రూ.6వేలు ఇంటికి తెచ్చివ్వడం సంతోషంగా ఉంది. ఈ రూ.ఆరు వేలే నాకు ఆధారం' అంటూ సోమలకు చెందిన దివ్యాంగురాలు మలిశెట్టిగారి శంకరమ్మ (30) పేర్కొన్నారు. నడవలేని స్థితిలో ఉన్న తాను గడచిన మూడు నెలలు పింఛను కోసం సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరిగి అవస్థలు పడ్డానని గుర్తుచేసు కున్నారు. ఇప్పుడేమో ఇంటి వద్దకే వచ్చి ఇస్తుండడం ఆనందంగా ఉందన్నారు. - సోమల

జిల్లా అధికారులే హాజరుకావాలి

ప్రతి సోమవారం ఉదయం 10గంటలకు నేనే అటెండెన్స్ వేస్తా ● అర్జీలపై కాలయాపన చేస్తే ఊరుకోను ● కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక





అర్జీలివ్వడానికి వేచివున్న బాధితులు, అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ, ఇతర అధికారులు

చిత్తూరు, జూన్ 1: 'ప్రజా ఫిర్యాదుల దినోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను వారం రోజుల్లోపు పరిష్కరించాలి. అర్జీలను కిందిస్థాయి అధికారులకు ఇచ్చి చేతులు దులుపుకొంటే ఊరుకోను. అధికారులే ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించాలి. ఇకపై ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులే హాజరు కావాలి. ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు నేనే అటెండెన్స్ వేస్తా. కిందిస్థాయి సిబ్బందిని పంపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటా'నని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఆయా శాఖ అధికారులు కూడా ప్రజల నుంచి వినతులను స్వీకరించాలన్నారు. అక్కడ పరిష్కారం కానివాటిని ఇక్కడకు పంపాలని సూచించారు. అలా కాకుండా అన్నింటికి ఇక్కడకు పంపితే ఊరుకోనని హెచ్చరించారు. కాగా, సోమవారం 10 నుంచి 15 మంది జిల్లా అధికారులు గైర్హాజరుకావడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 104 మంది అర్జీదారులు వినతిపత్రాలను అందించారు. రెవెన్యూశాఖకు 81, డీఆర్‌డీఏకు 12, రోడ్లు, భవనాలు, పౌరసరఫరాల శాఖ, డీఎస్వో, ఆరోగ్యశ్రీ, హౌసింగ్, విభిన్న ప్రతిభావంతులు, ఏపీ ఎస్పీడీసీఎల్ శాఖలకు ఒక్కో అర్జీ వంతున అందాయి. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, ఇతర జిల్లా అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని..

● గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ గ్రీన్ అంబాసిడర్లకు 25 నెలలుగా వేతన బకాయిలు ఇవ్వడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేసే కార్మికులకు వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతుకుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ. 10వేలను అమలు చేయాలని కోరారు. నూతన ప్రభుత్వమైన కార్మికుల సమస్యలను పట్టించుకోవాలన్నారు.

● నీరుపారే వంకను భూస్వాములు పూడ్చివేశారని పెనుమూరు మండలం కె.గొల్లపల్లె గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వంకను పూడ్చడంతో నీరు పొలాల్లోకి వచ్చే అవకాశం ఉందని, దీనివల్ల పంట పొలాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లా అధికారులు సర్వే చేయించి న్యాయం చేయాలని కోరారు.

● చిత్తూరులో పరిశ్రమల నుంచి వచ్చే నీటి కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని చిత్తూరు అభివృద్ధి వేదిక నాయకుడు చైతన్య ఆరోపించారు. నగరంలోని పోతంబట్లు కాలనీలో బోరు నుంచి రంగునీరు వస్తోందన్నారు. రిక్షాకాలనీ, చిత్తూరు మండలంలో ఉన్న కాలనీల్లో పరిశ్రమల కారణంగా రంగునీరు వస్తోందన్నారు. అధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు.

● అంగన్వాడీ భవన నిర్మాణ స్థలాన్ని కొందరు ఆక్రమించారని పెద్దపంజాణి మండలం బెరపల్లె గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులు ప్రహరీగోడను కూల్చి 15సెంట్ల భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని చెప్పారు. స్థానిక అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని, జిల్లా అధికారులు న్యాయం చేయాలని కోరారు.

బాధితులకు సత్వర న్యాయం : ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

ప్రజా ఫిర్యాదుల దినోత్సవానికి వచ్చిన అర్జీలపై సత్వర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ మణికంఠ ఆదేశించారు. సోమవారం ఆయన బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఇందులో వేధింపులు కింద 6, భూ తగాదాల కింద 7, ఆస్తి తగాదాల కింద 5, డబ్బు తగాదాల కింద 11, కుటుంబ తగాదాల కింద 2 అర్జీల వంతున అందాయన్నారు. ఏఎస్పీ అరీఫుల్లా, దిశ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అత్యున్నత ప్రమాణాలతో పారిశుధ్య చర్యలు చేపట్టాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

అధికారులతో టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అత్యున్నత ప్రమాణాలతో పారిశుధ్య చర్యలు చేపట్టాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో సోమవారం టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, హెల్త్ విభాగం అధికారులతో ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తుల క్యూలు విస్తరించిన ప్రాంతంలో తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో పారిశుధ్య పనితీరులో లోపం, సమయానికి శానిటరీ మెటీరియల్స్‌ను ఏజెన్సీలు సరిగ్గా సరఫరా చేయకపోవడం, నాణ్యతలేని క్లీనింగ్ సామాన్లను సరఫరా చేయడం తదితర అంశాలపై ఈవో అధికారులతో చర్చించారు. ఈవో మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లను కఠినంగా హెచ్చరించాలని, నిబంధనల ప్రకారం సరిపడా సిబ్బంది, మెటీరియల్ సరఫరా చేసి తిరుమలలో పరిశుభ్రత చర్యలు మెరుగుపరిచేందుకు మూడురోజుల సమయం ఇవ్వాలని జేఈవోలను ఆదేశించారు. మూడురోజుల తర్వాత ఆకస్మిక తనిఖీలు చేసేందుకు సీనియర్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసి, తదుపరి చర్యలు తీసుకోవడానికి పారిశుధ్యంపై సవివరమైన నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమీక్షలో ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవో హరికృష్ణ, హెల్త్ ఆఫీసర్ శ్రీదేవి, ఈఈ ఎఫ్ఎంఎస్ శ్రీనివాసరావు, హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొవిడ్ సమయంలో తగ్గించిన ప్రసాద దిట్టాన్ని పెంచండి

శ్రీవారి ఆలయానికి సంబంధించిన పలు ఆచార వ్యవహారాలు, వైఖానస ఆగమోపచారాలు, పలు అంశాలపై ఆలయ అర్చకులు, ఆగమ పండితులతో టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం సమీక్షించారు. తిరుమలలో వైఖానస ఆగమం ప్రకారం జరుగుతున్న వివిధ ఆచారాలు, కైంకర్యాల గురించి ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, గోవిందరాజ దీక్షితులు ఈవోకు వివరించారు. గతంలో ప్రతి సోమవారం ఆర్జితసేవగా నిర్వహించే విశేష సేవను కనీసం ఏడాదిలో ఒక్కసారైనా నిర్వహించాలని కోరారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి చెందిన శ్రీనివాస దీక్షితులు మాట్లాడుతూ.. కొవిడ్ సమయంలో తగ్గించిన ప్రసాద దిట్టం ఇంకా కొనసాగుతునే ఉందని, దానిని పెంచాలని ఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఆగమ సలహాదారులు ఆలయ ప్రతిష్టకు భంగం కలగకుండా పురాతన సంప్రదాయాలు పరిరక్షించడంలో, ఆచారాలకు విఘాతం కలుగకుండా చూసుకోవడంలో తమ పాత్రను ఈవోకు తెలిపారు. అనంతరం శ్రీవారి అన్నప్రసాదాలపై ఆలయ, పోటు అధికారులతో కూడా ఈవో సమీక్షించారు. ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు, రామకృష్ణదీక్షితులు, డిప్యూటీఈవో లోకనాథం, పోటు పేష్కార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.94 కోట్లు

తిరుమల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.94 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 81,005 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,244 మంది తలనీలాలు సమర్పించారు.

విజిలెన్సు ఏఎస్పీ ఈశ్వర రెడ్డి బదిలీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 1: తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు అదనపు ఎస్పీగా పనిచేస్తున్న ఈశ్వరరెడ్డిని బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన్ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలన్నారు. ఈశ్వర రెడ్డి స్థానంలో విజయవాడలో విజిలెన్సు ఎస్పీగా పనిచేస్తున్న కరీముల్లా షరీఫ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

పీఎంకే తాండాలో మళ్లీ ఒంటరి ఏనుగు ప్రత్యక్షం



ఒంటరి ఏనుగు దాడిలో దెబ్బతిన్న టమోటా తోట

రామకుప్పం, జూలై 1: రామకుప్పం మండలం పీఎంతాండా, పీఎంకేతాండాల మధ్య వారం కిందట రైతు కన్నా నాయక్‌ను చంపిన ఒంటరి ఏనుగు ఆదివారం రాత్రి మళ్లీ ప్రత్యక్షమైంది. పీఎంకేతాండా సమీపంలోని ధనపాల్‌నాయక్ టమోటా తోటలో తిన్నంత తిని, పాక్షికంగా ధ్వంసం చేసింది. రైతును పొట్టనపెట్టుకున్న ఒంటరి ఏనుగు మళ్లీ రావడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఒంటరి ఏనుగు కదలికలపై నిఘా ఉంచి పొలాలు, గ్రామాలవైపు రాకుండా చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను కోరుతున్నారు.

రేపు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు రూరల్, జూలై 1: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో గ్లోరియా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 1 నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

4న కుప్పంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కుప్పం, జూలై 1: కుప్పంలోని మండల సచివాలయంలో ఈనెల 4వ తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గంలోని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వీలైనంత మేరకు పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటూ సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, జూలై 1: జిల్లాలో ఖాళీగా ఉన్న మెయిన్, మినీ, హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా స్త్రీ-శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారిణి శైలజ తెలిపారు. 11 మెయిన్, 18 మినీ, 58 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రోస్టర్‌పాయింట్లు, కేంద్రాల వారీగా ఖాళీల వివరాలు సీడీపీవో కార్యాలయాల్లో ఉన్నాయన్నారు. అభ్యర్థులు స్థానిక గ్రామ, వార్డు పరిధికి చెంది వివాహితులై ఉండాలన్నారు. పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 19వ తేది సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను ఆయా సీడీపీవో కార్యాలయాల్లో ఇవ్వాలన్నారు.

ట్రాక్టర్‌హెడ్‌లు వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం

చిత్తూరు, జూలై 1: ఎస్సీ కార్పొరేషన్‌లో సబ్సిడీ కింద మంజూరైన వాహనాలను లబ్ధిదారులకు అందించామని, ట్రాక్టర్‌హెడ్‌లు రాని కారణంగా కొన్నింటిని పంపిణీ చేయలేదని ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ రాజ్యలక్ష్మి తెలిపారు. 'ముళ్లపొదల్లో సబ్సిడీ వాహనాలు' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. 2018-19లో ఎన్ఎస్‌కూ ఎఫ్‌డీసీ పథకం కింద 65 డ్రైనేజీ క్లీనింగ్ మిషన్లు, 30 ట్రాక్టర్లు మంజూరయ్యాయన్నారు. 30 డ్రైనేజి క్లీనింగ్ మిషన్లు, 30 ట్రాక్టర్లను లబ్దిదారులకు పంపిణీ చేశామన్నారు. మిగిలిన డ్రైనేజీ క్లీనింగ్ మిషన్లను పంపిణీ చేయడానికి ట్రాక్టర్‌హెడ్‌లను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో కలెక్టరేట్ ప్రాంగణంలో ఉంచామన్నారు. కాగా వాటిలోని విడిభాగాలన్నింటినీ దొంగలు తీసుకెళ్లారని అక్కడివారే చెబుతున్నారు.

రేపటిలోగా అభ్యర్థులు వ్యయ వివరాలు సమర్పించాలి



అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 1: ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు తమ వ్యయ వివరాలను ఆర్వోలకు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వ్యయ పరిశీలకులు శంకర్‌ప్రసాద్ శర్మ, శ్రీనివాస్ ఖన్నా, రోషన్ ఠాకోర్‌తో కలిసి అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచి ఇప్పటివరకు చేసిన ఎన్నికల ఖర్చుల వివరాలను చాలామంది అభ్యర్థులు అందజేశారన్నారు. మిగిలినవారు ఈనెల 3వ తేదీలోగా అందించాలన్నారు. వ్యయ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు.

పండుగలా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు


కలికిరిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి


మదనపల్లెలో పింఛన్ ఇస్తున్న మైనార్టీ నేత ఎస్పీ మస్తాన్


నిమ్మనపల్లెలో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా, టీడీపీ నాయకులు


బి.కొత్తకోట ఇందిరమ్మ కాలనీలో పింఛన్ల పంపిణీలో జయచంద్రారెడ్డి తదితరులు

మదనపల్లె/టౌన్, జూలై 1: రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని సోమవారం పండుగలా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ప్రారంభోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మదనపల్లె, నిమ్మనపల్లె, మదనపల్లె పట్టణంలో 42 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పర్యటించి, ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయం 6.00గంటలకే మండలంలోని సీటీఎం గ్రామంలో ఆర్డీవో హరిప్రసాద్, ఎంపీడీవో భానుప్రసాద్‌లతో కలసి లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను తూ.చ. తప్పకుండా నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. ఒక్క మదనపల్లె మండలంలోనే 11,142 మందికి పెంచిన పింఛన్ రూ.4వేలతో పాటు చంద్రబాబు చెప్పినట్లు ఏప్రిల్, మే, జూన్ నెలలతో కలిపి మొత్తం రూ.7వేలు చొప్పున పింఛన్‌లు పంపిణీ చేస్తున్నారన్నారు. దివ్యాంగులకు పెంచిన పింఛన్‌తో వారిలో భద్రత వస్తోందన్నారు. కొత్తిండ్లు పంచాయతీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఇచ్చిన ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం మూడు రోజుల్లోనే మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ రమాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని కొత్తపల్లె పంచాయతీలో టీడీపీ-ఎన్ఆర్ఐ లోకేశ్ కొణెదల చేతుల మీదుగా పెరవలి నవీన్, నిరంజన్‌నాని, రాజేష్‌లు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. వేంపల్లె పంచాయతీలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వై.దొరస్వామి నాయుడు చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలోని 28, 33 వార్డుల్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జోలెపాళెం భవానిప్రసాద్, ఉపాధ్యక్షుడు చెక్కా రామ్మోహన్‌బాబు పింఛన్లు పంపిణీ చేశారు. మదనపల్లె మున్సిపాలిటీలో ఎమ్మెల్యేతోపాటు ఆర్డీవో హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలతో కలసి పింఛన్లు పంపిణీని ప్రారంభించారు. 13వవార్డులోని మోతీనగర్‌లో టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు ఎస్.ఎ.మస్తాన్, ఆపార్టీ మైనార్టీ నాయకురాలు ఎస్పీ నస్రీన్‌తాజ్‌లు వేర్వేరుగా పంపిణీ చేశారు. 15వవార్డు పరిధిలోని బుగ్గకాలువ, వాల్మీకివీధి ఏరియాలలో మాజీకౌన్సిలర్ సాకే లక్ష్మీదేవి, టీడీపీ నాయకుడు సాకే కృష్ణమూర్తిలు పింఛన్లు పంపిణీ చేశారు. బసినికొండ పంచాయతీలోని గంగాన్నగారిపల్లె, రామాచార్లప ల్లె, కురవపల్లె, మొరవపల్లెలో టీడీపీ నేత గంగారపు బాబురెడ్డిలు పింఛన్ల పండుగలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలంలో 6284 మంది పింఛనుదారులు ఉండగా సోమవారం సాయంత్రం 7 గంటల వరకు 5844 మందికి 93 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో క్రిష్ణమూర్తి తెలిపారు. ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఇంటి వద్దకే వెళ్లి ఫించన్లు పంపిణీ చేశారు. టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త మల్లికార్జుననాయుడు ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడుకు క్షీరాభిషేకం చేశారు. అదేవిధంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి పింఛను పంపిణీలో పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్ధమ్మ, పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు చంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీన, సోముశేఖర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, తెలుగుయువత నరసింహులు, మధుసూదన్, గంగరాజు, కాలానారాయణ, పురుషోత్తం, సుధాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఎద్దుల నరసింహులు, రాజారెడ్డి, శంకర్‌రెడ్డి, వీరాంజినేయులు, జయరాంరెడ్డి, రెడ్డప్ప, నరేంద్రనాయుడు, ఆనందనాయుడు, మ్యూజికల్‌శివ, రామలింగారెడ్డి, శేఖర్, బీసీ క్రిష్ణమూర్తి, జగదీష్, భాస్కర్, అంజి, మల్లి తదితరులు పాల్గొన్నారు.

పరదాల సీఎం పోయాడు... ప్రజల సీఎం వచ్చాడు

ములకలచెరువు, జూలై 1: ప్రజల కోసం అనుక్షణం పరితపించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువు, పెద్దపాళ్యం, వేపూరికోట, దేవళచెరువు, సోంపల్లె గ్రామాల్లో సోమవారం లబ్ధిదారులకు ఉదయం ఆరు గంటలకే పింఛన్లను పంపిణీ చేశారు. ములకలచెరువులో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు జయచంద్రారెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల పరదాల సీఎంను చూశామని.. ఇప్పుడు ప్రజా ముఖ్యమంత్రిని చంద్రబాబును చూస్తున్నామన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా చంద్రబాబునాయుడు నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్లు అందించడం హర్షణీయం.. అభినందనీయమన్నారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అలాగే లబ్ధిదారులతో కలిసి కేక్‌లు కట్ చేశారు. కాగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుడిగాలి పర్యటన చేసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నేతలు మంత్రి గిరిధర్‌రెడ్డి, చెన్నకిష్టా, గుత్తికొండ త్యాగరాజు, కేశవులు, సురేష్, నాయకులు ప్రసాద్‌రెడ్డి, వెంకటస్వామి, కట్టా హరినాథ్, భజంత్రి రామాంజులు, ముగి రవి చంద్ర, భాస్కర్‌రెడ్డి, అంజనేయరెడ్డి, శ్రీనివాసులు, రెడ్డెప్ప, ఆది, ఆదిమూర్తి, చాంద్‌బాషా, రసూల్, ప్రతాప్‌నాయుడు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: రాష్ట్ర ముఖ్యమంతి చంద్రబాబునాయుడు పెంచిన అన్ని ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం సోమవారం అధికారులు, కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్‌వోలు కూటమి నేతలు పండుగలాగ నిర్వహించారు. తంబళ్లపల్లి కూటమి ఇన్‌చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి మండలంలోని వెలిగల్లు, తురకపల్లి గ్రామాలలో కూటమి నేతలు ఏర్పాటు చేసిన కేక్‌లు కట్ చేసి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసి పంచన్‌లు పంపిణీ చేశారు. తంబళ్లపల్లి టీడీపీ పరిశీలకులు సీడ్ మల్లికార్జుననాయుడు, ఎంపీడీవో వెంకటరమణయ్య, ఎంపీటీసీ రుక్మాంగధరెడ్డి మాజీ ఎంపీపీ రజనీదత్, కూటమి నేతలు చల్లపల్లె వేణగోపాల్‌రెడ్డి, సిద్దవరం ప్రసాద్, గంగాధర, కుంటకిందపల్లి చంద్రారెడ్డి, ఇస్మాయిల్(చింటు) వసీం, అహ్మద్, క్రిష్టారెడ్డి, బండి యుగంధర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, శంకర, రామాంజులునాయుడు, నార శ్రీనివాసులు, రామాంజునేయులు, విశ్వనాధరెడ్డి, సయ్యద్‌షావలి, గరిబున్నీషా, మాజీ సర్పంచ్ నాగార్జున, హసీంసాబ్, తుమ్మల మహేశ్వర, రఘునాధరెడ్డి, అస్రఫ్, మేకల చలసతి, మోహన నాగూర్‌వలి, గల్లా నారాయణ, ప్రభాకరరెడ్డి, మాస్టర్ వెంకటరమణ, కాలేషా, మైసూర్ శ్రీనివాసులు, రియాజ్, మాజీ సర్పంచ్ వేమయ్య పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో :పెద్దతిప్పసముద్రం మండలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ కార్యక్రమం పండుగలా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామ, వార్డు సచివాలయ పరిదిలోని సచివాలయ ఉద్యోగులచే ఆయా గ్రామాల్లో కూటమి నేతలు పింఛన్లు పంపిణీ చేశారు. రంగసముద్రం గ్రామం విసనకర్రవాండ్లపల్లెలో కూటమి నేతలు బావన్న, లక్ష్మినరుసు, ఆంజనేయరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామాంజిల అద్వర్యంలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. టి.సదుం పంచాయతీలో తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ యువనేత మనోజ్‌జయంత్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ శారద చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్లను అందించారు.

నిమ్మనపల్లిలో: రాష్ట్రంలోని వృద్ధుల కళ్లల్లో ఆనందం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను పెంచాడని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు, సోమవారం పెంచిన ఫించన్ రూ.4వేల పాటు మూడు నెలలకు సంభదించి మొత్తం రూ. 7వేలను వృద్ధులకు అందించారు. మండలంలో 97శాతం పింఛన్లు పంసిణీ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు రెడ్డెప్పరెడ్డి, శ్రీరాములు, సుధాకర్‌రావు, మునిరత్న, రాజన్న, శ్రీపతి, జయన్న, లక్ష్మన్న, చెంద్రాయుడు, కేశవ, మురళి, మల్లికార్జున తదితరులలు పాల్గొన్నారు.

పెరిగిన పంఛన్లతో అవ్వాతాతలకు మరింత ఆసరా!

● పీలేరులో ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, జూలై 1: పెరిగిన సామాజిక భద్రతా పింఛన్లతో సమాజంలోని అవ్వాతాతలు, ప్రత్యేక ప్రతిభావంతులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి మరింత ఆసరా దొరుకుతుందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పీలేరు పట్టణంలోని యల్లమంద క్రాసు, కట్టుకాలువ వీధి, బండ్లవంక ప్రాంతాల్లో సోమవారం ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ పెద్దన్నలా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెంచిన పింఛన్ల పెంపు కోట్లాది మంది జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందన్నారు. పీలేరు పట్టణం ఆర్టీసీ నల్లగుట్టలో టీడీపీ శ్రేణులు, ప్రజలు చంద్రబాబు నాయుడు, నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పీలేరు మండలంలో 9864 పెన్షన్లు ఉండగా సోమవారం 8878(90 శాతం) పెన్షన్ల పంపిణీ పూర్తి చేశామని ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి తెలిపారు. మిగిలినవి మంగళవారం మధ్యాహ్నానికల్లా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, మల్లెల రెడ్డిబాషా, కోటపల్లె బాబు, లడ్డూ జాపర్, రియాజ్, షౌకత్‌అలీ, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, స్పోర్ట్స్ మల్లి, జహీర్, మహబూబ్ బాషా, లక్ష్మీకాంతమ్మ, సాధన, షమ, వాణి, పురం రెడ్డమ్మ, స్వర్ణలత, రెడ్డిరాణి, విజయ కుమార్, సురేశ్, సందీప్, జీలానీ, జనసేన నేతలు కలప రవి, గజేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

గుర్రంకొండలో:తెలుగుదేశం ప్రభుత్వం కొలుదీరగానే పెంచిన పింఛన్ల సొమ్మును లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందించారు. ఈ క్రమంలో ప్రతి గ్రామంలో లబ్ధిదారుల ఇంటికి సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు వెళ్లి పెంచిన పింఛన్ సొమ్మును నేరుగా అందజేశారు. టీడీపీతోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, ప్రసాద్‌నాయుడు, నౌషాద్ అహ్మద్, ఏజాజ్‌అహ్మద్, హరిప్రసాద్‌నాయుడు, ఎల్లుట్ల మురళీ, చంద్రబాబు, చలమారెడ్డి, బయ్యారెడ్డి, మేలక చలపతి, రాము, శేఖర్, మహాత్మారెడ్డి, నాగేంద్ర, నరసింహులు, జయసూరి, ఆనంద్, వెంకటక్రిష్టారెడ్డి, ప్రదీప్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కలకడలో:ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో టీడీపీ, బీజేపీ, జనసేన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట నెర్వేర్చిందని నాయకులు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో వివిధ రకాల పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నాయకులు, సచివాలయ సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పొత్తూరి ప్రభాకర్‌నాయుడు, రవిప్రకాశ్‌నాయుడు, చంద్రమోహన్, కుమారి, నాగరాజనాయుడు, విశ్వనాథ్, లక్ష్మీప్రసన్న, బాలకృష్ణారెడ్డి, రమణ, తారకేశ్వర, కోట రమణనాయుడు, బాలాజిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో: పెంచిన పింఛన్లను పూర్తి స్థాయిలో అందజేయడంలో సీఎం చంద్రబాబు నాయుడు మాట నిలుపుకున్నారని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కిశోర్‌కుమార్ రెడ్డి స్వగ్రామం నగరిపల్లెలో పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని మసీదు వీధిలో ఇంటింటికీ పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మాజీ కలికిరి సర్పంచు లక్ష్మీకర్ రెడ్డి, రెడ్డివారి యోగేష్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, పార్లమెంటు ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, జ్ఞానమూర్తి, వైజాగ్ బాషా, అబ్దుల్‌ఖాదర్, ఎసానుల్లా, అఫ్రోజ్, అన్సర్, జనసేన ఇన్‌చార్జి అస్లామ్, రమేష్ చెట్టి, లేపాక్షి అస్లామ్, ఎంపీడీవో రామకృష్ణయ్య, ఈవో ఆర్డీ పరశురామ్, కార్యదర్శి గురుమోహన్ పాల్గొన్నారు. కాగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లోనూ 94 శాతం పింఛన్లు పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య చెప్పారు. 6652 మంది పింఛనుదార్లకు రూ.4,50,26,500లు పంపిణీ చేశామన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురంలో, మండలం వ్యాప్తంగా సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నమాజ్‌కట్ట వద్ద టీడీపీ జెండా ఎగురవేసి, సీఎం నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తూ జయహో చంద్రన్న అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా భారీగా బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటా సచివాలయం ఉద్యోగులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మండలంలో మొత్తం 6895మంది లబ్ధిదారులకు గాను రూ.4,69,6900లు పంపిణీలో 80శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమాలలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, సర్పంచ్ మహిత, నాయకులు పీవీ నారాయణ, పులి సత్యారెడ్డి సురేంద్రవర్మ, వల్లిగట్ల వెంకటరమణ, శేషాద్రిరెడ్డి, మురళి, తోటవీధి ఫణి, సైదు, బొక్కసం బ్రదర్స్ జంషీద్, తరుణ్, జగ్గు, హుస్సేన్, జావీద్, మస్కట్ మస్తాన్, కువైట్ సయ్యద్‌బాషా, డిష్ బ్రదర్స్ రామాంజులురెడ్డి, స్వర్ణలత, చింతల దామోదర్‌రెడ్డి, సికిందర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట మండలంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగింది. మండలంలోని ప్రతి గ్రామంలో సచివాలయ సిబ్బందితో పాటు స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. నగరపంచాయతీ పరిధిలోని ఇందిరమ్మకాలనీలో నియోజకవర్గ నేత జయచంద్రారెడ్డి, కమిషనర్ మనోహర్‌లు పింఛన్ల పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 8005 మందికి పింఛను మంజూరు కాగా 7409 మందికి పంపిణీ పూర్తి అయింది. రూ.5,46,26,500 మంజూరు అవ్వగా రూ.5,05,77,4500 పంపిణీ (92.59శాతం) చేసినట్లు ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, నారాయణస్వామిరెడ్డి, కుడుం శ్రీనివాసులు, బంగారువెంకట్రమణ, కనకంటిప్రసాద్, కుడుం రంజిత్, శరత్, సురేంద్ర, రాజా, దేవుడునాగరాజు, మస్తాన్, సమీవుల్లా పాల్గొన్నారు.

కురబలకోటలో: సంక్షేమం-అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలో ప్రభుత్వం పెంచిన ఎన్టీఆర్ భరోసా ఫించన్లను మండలంలోని ప్రతి గ్రామంలో అధికారులు, టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అలాగే పలుచోట్ల చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంగారాఘవరెడ్డి, అయూబ్‌బాషా, రుద్రబాలకృష్ణ, రామచంద్ర, అశోక్, కిరణ్‌కుమార్, తిమ్మరాయుడు, వై.జి.రమణ, దామోదర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


కురబలకోటలో పింఛన్ ఇస్తున్న టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్


పీలేరు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు


పీటీఎంలో పింఛన్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు మనోజ్‌జయంత్‌రెడ్డి, సర్పంచ్ శారద


వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లెలో పింఛన్లు అందజేస్తున్న కూటమి నాయకులు

అలరించిన తపస్సుమానోత్సవం

మదనపల్లె అర్బన్, జూలై1: స్థానిక టిప్పుసుల్తాన్ మైదానంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం సాయంత్రం తపస్సుమానోత్సవం ప్రేక్షకులను అలరించింది. శ్రీ వేంకటేశ్వరనాట్య కళామండలి అధ్యక్షుడు చలపతి ఆధ్వర్యంలో మహాభారత కమిటీ డాక్టర్ రామచంద్రనాయుడు, బీజేపీ వెంకటేష్ పర్యవేక్షణలో 18 రోజులపాటు మహాభారతయజ్ఞం నిర్వహిస్తున్నారు. పురాతన ఇతిహాసాన్ని మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లె ప్రజలు ఆదరిస్తున్నారు. అర్జున వేషదారి చలపతి తపస్సు మానుకున్న 18 మెట్లను 18 పద్యాలను ఆలపిస్తూ అధిరోహించారు. ఈ ఘటాన్ని తిలకించడానికి వందలాదిగా భక్తులు పాల్గొని తిలకించారు.

రేపు బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె టౌన్, జూలై 1: అన్నమయ్య జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్లను మదనపల్లె మండలం పోతబోలు వేద పాఠశాలలో బుధవారం ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు దిలీప్‌కుమార్, మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జూనియర్ బాలికులు, సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్లు ఎంపిక చేస్తామన్నారు. ఈ ఎంపిక కార్యక్రమానికి హాజరయ్యే క్రీడాకారిణులు వారి ఆధార్‌కార్డు, పుట్టినరోజు సర్టిఫికెట్ తప్పని సరిగా తీసుకురావాలన్నారు. సబ్ జూనియర్ బాలికలు జనవరి ఒకటో తేది 2011 నుంచి డిసెంబర్ 31వ తేది 2012 లోపు పుట్టి వుండాలన్నారు. అలాగే జూనియర్ బాలికలు జనవరి ఒకటో తేది 2008 నుంచి డిసెంబర్ 31వ తేది 2010 లోపు పుట్టి వుండాలన్నారు. పూర్తి వివరాలకు 95020 74146 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్‌వోగా డాక్టర్ రమేశ్

మదనపల్లె టౌన్, జూలై 1: మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్‌వోగా డాక్టర్ రమేశ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డిప్యూటీ డీఎంహెచ్‌వగా పనిచేసిన డాక్టర్ లక్ష్మి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకోవడంతో ఆమె స్థానంలో నిమ్మనపల్లె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేశ్ పూర్తి అదనపు బాధ్యతలతో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, డయేరియా నివారణపై దృష్టి పెడతామని రమేశ్ పేర్కొన్నారు.

బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలి

కలకడ, జూలై 1:ఎరువులు, మందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులను తప్పని సరిగా ఇవ్వాలని మదనపల్లె ఏడీఏ శివశంకర్ యజమానులకు సూచించారు. సోమవారం ఆయన కలకడలో ఎరువుల దుకాణాలు, గోడౌన్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏవో లావణ్య పాల్గొన్నారు.

తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖర్

మదనపల్లె అర్బన్, జూలై1: స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయంలో తొగటవీర క్షత్రియ సంఘం మదనపల్లె అధ్యక్షుడుగా పురాణం చంద్రశేఖర్, ఎన్నికయ్యారు. కార్యదర్శిగా పవన్‌కుమార్, ట్రెజరర్‌గా రామిశెట్టి రత్నమయ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి

మదనపల్లె టౌన్, జూలై 1: బ్రిటీష్ కాలంనాటి ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఈసీ చట్టాలను సవ రించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టాల పట్ల ప్రజలు అవగాహన పెంచు కోవాలని మదనపల్లె తాలూకా, టు టౌన్ సీఐలు ఎన్.శేఖర్, జి.యువరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో కేంద్రప్రభుత్వం అమలు ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఈసీ చట్టాల స్థానంలో అమలు చేయనున్న బీఎన్ఎస్(భారతీయ న్యాయ సంహిత), బీఎన్ఎస్ఎస్(భారతీయ నాగరిక సురక్షిత సంహిత), బీఎస్ఏ(భారతీయ సాక్ష్య అధీనయం) చట్టాల గురించి సీఐలు వివరించారు. జ్ఞానాంబిక కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలికిరిలో: కొత్త చట్టాల గురించి స్థానిక పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆర్. మోహన్ మాట్లాడుతూ గతంలో జీన్న ఐపీసీ చట్టాన్ని భారతీయ న్యాయ సన్హితగానూ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ను భారతీయ సాక్ష్య అధీని యం చట్టం గానూ, సీఆర్పీసీ చట్టాన్ని భారతీయ నాగరిక్ సురక్ష సన్హితగాను మార్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.దేవేంద్రకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన చట్టాలను ప్రజలందరూ అవగాహన చేసుకొని, వాటిని అనుసరించాలని బి.కొత్తకోట సీఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని జ్యోతిసర్కిల్‌లో ఈ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు తమకు ఏదైనా అన్యాయం జరిగినప్పుడు నేరుగా స్టేషన్‌కు రాకపోయినా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పీలేరులో: కొత్తగా అమల్లోకొ వచ్చిన చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష, భారతీయ సాక్ష్య అధినియమ్‌లపై సోమవారం పీలేరు అర్బన్ పోలీసులు విద్యార్థులు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అర్బన్ సీఐ మోహన్ రెడ్డి ఆయా చట్టాల్లోని అంశాలు, వివిధ నేరాలకు అమలయ్యే శిక్షలను వారికి వివరించారు.

కలకడలో:స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో సోమవారం నుంచి అమలైన కొత్త చట్టాలను గురించి ప్రజలకు వివరించారు. ఈ. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్లబైలు అక్రమాలపై సమగ్ర విచారణ చేయించాలి

మదనపల్లె టౌన్, జూలై 1: మదనపల్లె మండలం కోళ్లబైలు కాలని సర్వే నెంబర్ 10 లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణకు ఆదేశించాలని ఆర్డీవో హరిప్రసాద్‌ను సీపీఐ నాయకులు విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సందర్భంగా సీపీఐ నేత మురళి మాట్లాడుతూ సర్వే నెంబర్ 10లో ఉన్న 20 ఎకరాలను పూర్తిగా సర్వే చేసి హద్దులు నిర్ణయించి వంక పొరంబోకు స్థలంలో ఆక్రమణలను తొలగించాలని కోరారు. గృహహింస నుంచి తనకు పోలీసులు రక్షణ కల్పించడం లేదని వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామం యల్లప్ప కుమార్తె గుణవతి ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. అదనపు కట్నం కోసం తన భర్త, అత్తమామలు వేధించి,హింసిస్తున్నారని వాల్మీకిపురం, మదనపల్లె పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగలేదని ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. మొత్తం మీద ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 22 మంది ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ఆర్డీవోకు అర్జీలు అందజేశారు.


ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అర్జీలు తీసుకుంటున్న ఆర్డీవో హరిప్రసాద్

భూసమస్యలను వెంటనే పరిష్కరించండి

పెద్దతిప్పసముద్రం జూలై 1 : మండలంలోని కందుకూరు, రాపూరివాండ్లపల్లె గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరికుమార్ మండల తహసీల్దార్ నరసింహరావ్‌ను కోరారు. ఆమేరకు సోమవారం సీపీఐ నాయకులతో కలసి తహసీల్దార్‌కు వారొక వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కందుకూరు గ్రామం పాత కందుకూరుకు చెందిన గంగులప్ప గత 50 సంవత్సరాల నుంచి ప్రభుత్వ భూమిని చదును చేసుకుని వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడని తన ఆదీనంలో ఉన్న భూమికి డిపట్టా చేసి పాసు పుస్తకాలను మంజూరు చేయాలన్నారు. రాపూరివాండ్లపల్లె గ్రామం డి. నారాయణ పల్లెకు చెందిన కోసువారిపల్లె కదిరప్ప తన ఆస్తికి సంబంధించి వారసత్వం గా కుమార్తె పి. విజయనిర్మల పేరు మీద పాసు పుస్తకాలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మొలకలచెరువు సీపీఐ మండల నాయకులు ఆంజనప్ప, కార్యవర్గ సభ్యులు నిజాముద్దీన్, కుమారస్వామి, రమణప్ప, చిన్నరెడ్డెప్ప, విజయనిర్మల, రెడ్డెప్ప పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న టీడీపీ నేత మల్లికార్జున

● డ్రైవింగ్‌లో ఉండగా అశ్వస్థతకు గురైన ఆర్టీసీ డ్రైవర్

●తన వాహనంలో ఆసుపత్రికి తరలించి వైద్యులచే చికిత్స

తంబళ్లపల్లె, జూలై 1: అశ్వస్థతకు గురైన ఆర్టీసీ బస్సు డ్రైవరును సమయానికి ఆసుపత్రికి తరలించి వైద్యులచే చికిత్స అందించి తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ప్రచార సమన్వయకర్త మల్లికార్జుననాయుడు మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే...సోమవారం ఉదయం మదనపల్లె నుంచి తంబళ్లపల్లెకు ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ చలపతి డ్రైవింగ్‌లో ఉండగా జోగివానిబురుజు సమీపంలో తీవ్ర అశ్వస్థతకు గురయ్యాడు. దీంతో బస్సును నడపడానికి ఇబ్బందిపడి అక్కడే నిలిపివేశాడు. ఇదే సమయంలో మదనపల్లె నుంచి తంబళ్లపల్లెకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమానికి వస్తున్న మల్లికార్జుననాయుడు ఈ విషయాన్ని గమనించి వెంటనే ఆర్టీసీ డ్రైవరును తన సొంత వాహనంలో తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. కాగా బస్సులో చాలా వరకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉండటంతో పాఠశాలకు ఆలస్యమవుతుందని మల్లికార్జుననాయుడుతో వస్తున్న ఓ టీడీపీ నాయకుడు బస్సును డ్రైవింగ్ చేసి ప్రయాణికులను సురక్షితంగా తంబళ్లపల్లెకు చేర్చారు. తంబళ్లపల్లెలో ఫించను పంపిణీ కార్యక్రమంలో ఉన్న టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డికి ఈ విషయం తెలియడంతో ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న డ్రైవరును పరామర్శించారు. మల్లికార్జుననాయుడు మానవతా ధృక్పదంతో వ్యవహరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.


ఆర్టీసీ డ్రైవరు చలపతిని పరామర్శిస్తున్న జయచంద్రారెడ్డి, మల్లికార్జుననాయుడు

డయేరియా నియంత్రణే లక్ష్యం

తంబళ్లపల్లె, జూలై 1: తంబళ్లపల్లె మండలంలో డయేరియా నియంత్రణే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవగాహన కల్పిద్దామని కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి అనుపమ పేర్కొన్నారు. సోమవారం కోసువారిపల్లెలో డయేరియా నియంత్రణకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ...ఈ నెల 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమం ద్వారా ప్రజలకు డయేరియా నియంత్రణ పట్ల అవగాహన కల్పిస్తామన్నారు. ఎవరికైనా డయేరియా లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ క్రిష్ణానాయక్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: అతిసార నివారణకు చర్యలు చేపట్టాలని పెద్దమండ్యం పీహెచ్‌సీ, ఆయుష్ డాక్టర్లు హరివర్మ, మహబూబ్‌బాష పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం లో సోమవారం అతిసార నివారణకు వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు వేడి చేసి చల్లార్చిన మంచినీరు తాగాలన్నారు. పరిసరాలు పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆగస్టు 31 వరకు అతిసార నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు సూచించారు. సీహెచ్‌వో క్రిష్ణయ్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెలుగు వృద్ధాశ్రమంలో సీఐ జన్మదిన వేడుకలు

మదనపల్లె అర్బన్, జూలై1: మండలంలోని కోళ్లబైలు పంచాయతీ, అమ్మచెరువుమిట్టలోని వెలుగు వృద్ధాశ్రయంలో సోమవారం మదనపల్లె తాలుకా సీఐ ఎన్.శేఖర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఆశ్రమంలో కేక్‌కట్ చేసి పిల్లలకు, వృద్ధులకు పంచిపెట్టారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ యువరాజుతో పాటు టీడీపీ నాయకులు డ్యాన్స్ రెడ్డెప్ప, మల్లికా ర్జుననాయుడు, యర్రపల్లె వెంకటరమణారెడ్డి, వెలుగు ప్రత్యేక పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


కేక్‌కట్ చేస్తున్న సీఐలు శేఖర్, యువరాజ, తదితరులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

తంబళ్లపల్లె, జూలై 1: మదనపల్లె శ్రీ వెంకటేశ్వర హార్ట్, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారు సోమవారం తంబళ్లపల్లె పాత కాలేజీ మైదానంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తంబళ్లపల్లె మనోజ్ క్లీనిక్ ఆర్ఎంపీ వైద్యుడు రామాంజులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 150 మందికి పైగా హాజరయ్యారు. వారికి వైద్యుడు ఎస్‌బీ కిషోర్ గుండెకు సంబంధించిన జీఆర్‌బీఎస్, ఈసీజీ, 2డీఎకోతో పాటు శ్వాసకోస వ్యాధులు, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, రోగులు, స్థానికులు పాల్గొన్నారు.


గుండె వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు కిషోర్

కుక్కల దాడిలో జింకకు గాయాలు

తంబళ్లపల్లె, జూలై 1: జింకపై కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు...తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని చేలూరివాండ్లపల్లె పొలాల్లోకి సోమవారం సాయంత్రం ఓ జింక వచ్చింది. దాన్ని పసిగట్టిన కుక్కలు తరుముకుని గాయపరిచాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానిక టీడీపీ నాయకుడు పురుషోత్తం, గ్రామస్థులు జింకను కుక్కల బారి నుంచి రక్షించి తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి వెంకట్రామయ్యకు సమాచారం ఇచ్చారు. వెంటనే వెంకట్రామయ్య పశువైద్యుడు కిరణ్ ద్వారా జింకకు చికిత్సలు అందించారు. అనంతరం గ్రామస్థులు జింకను అటవీశాఖాధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

నాటుసారా విక్రయాలను అరికట్టండి

నిమ్మనపల్లి, జూలై 1: మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతి సోమానపల్లిలో రోజురోజుకు నాటుసారా విక్రయాలు పెరిగిపోయాయని వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సోమవారం గ్రామస్థులు కోరారు. ఆమేరకు స్థానిక పోలీసులకు వారొక వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు నాటుసారాకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకొంటున్నారని తెలిపారు. అంతే కాకుండా నిత్యం గొడవలు చేసుకొని పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగున్నారని నాటుసారా వల్ల గ్రామాలలో బతకలేని పర్థితి నెలకొందని తెలిపారు. పోలీస్ నాటుసారాపై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరారు.


నాటుసారాపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళలు